షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 210 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 12 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 210 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE June 12, 2024 PAGES : 8 PRICE : 3/-

## ఒడిషాలో సిఎంగా తొలి గిరిజన నేత

బిజెపి సిఎంగా మోహన్ చరణ మాఝి ప్రమాణం

ఇద్దరు ఉప ముఖ్యమంత్రులకు అవకాశం

హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు

కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సిఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్,జూన్12(షణ్ముఖవెలుగు): ఒడిశాలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరింది. నూతన ముఖ్యమంత్రిగా మోహన్ చరణ మాఝి ప్రమాణస్వీకారం చేశారు. దీంతో రాష్ట్రంలో భాజపా తరఫున తొలి సీఎంగా రికార్డు సృష్టించారు. ఆయనతోపాటు ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కనక్ వర్ధన్ సింగ్‌దేవ్, తొలిసారి ఎమ్మెల్యే అయిన ప్రవతి పరీదాలు

మిగతా 2లో..





# ఏపిలో చంద్రోదయం



## కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

## సిఎంగా చంద్రబాబు ప్రమాణం

పవన్ కళ్యాణ్, లోకేశ్ తదితరుల ప్రమాణం

ప్రమాణం చేయించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, గడ్కరీ తదితరులు

కార్యక్రమంలో మార్మోగిన చంద్రబాబు, టిడిపి నినాదాలు

విజయవాడ,జూన్12(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గత ఎన్నికల్లో అతిపెద్ద విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నూతన ముఖ్యమంత్రిగా తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చంద్రబాబుతో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. అనంతరం మంత్రులతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో సభా ప్రాంగణం జై చంద్రన్న నినాదాలతో మార్మోగిపోయింది. తెదేపా నేతలు, కార్యకర్తలు తమ స్థానాల్లోనే నిలుచుని చప్పట్లతో అభినందనలు పలికారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీతో పాటు వేదికపై ఉన్న పలువురు అతిథులు చంద్రబాబుకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్‌నాయుడు, చిరాగ్ పాసవాన్‌తో పురంధేశ్వరి, మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే, మాజీ గవర్నర్ తమిళసై, మాజీ సిఎం పన్నీరు సెల్వం తదితరులు కూడా హాజరయ్యారు. పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు జాతీయ నాయకులు హాజరయ్యారు. సినీ ప్రముఖులు చిరంజీవి, రజనీకాంత్ దంపతులు, రామ్‌చరణ్

మిగతా 2లో..



ఏపీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నాలుగో సారి ప్రమాణ స్వీకారం చేశారు. కేసరపల్లిలో ఏర్పాటు చేసిన సభాప్రాంగణంలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్.. నారా చంద్రబాబు నాయుడితో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయించారు. చంద్రబాబు నాయుడు అనే నేను.. అని అనగానే సభా ప్రాంగణం హోరెత్తిపోయింది. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగంపట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారత దేశ సార్వ భౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడుతానని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతః కరణ శుద్ధితో..నిర్వహిస్తానని, భయంగాని, పక్షపాతం గాని, రాగద్వేషాలు గాని లేకుండా రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి, ప్రజలందరికీ న్యాయం చేకూరుస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. నారా చంద్రబాబు నాయుడు అనే నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా పరిశీలనకు వచ్చిన, నాకు తెలియవచ్చిన కర్తవ్యాలను నిర్వహిస్తానని, అవసరమైన మేరకు తప్ప ఆ విషయాలను ప్రత్యక్షంగా గానీ.. పరోక్షంగా కానీ ఏ వ్యక్తికీ వెల్లడించనని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నానని తెలిపారు.



## తొలుత పవన్ కళ్యాణ్.. తరవాత లోకేశ్

మంత్రిగా రెండోసారి ప్రమాణం

విజయవాడ,జూన్12(షణ్ముఖవెలుగు): మంత్రిగా నారా లోకేష్ ప్రమాణ స్వీకారం చేశారు. నారా లోకేష్‌తో గవర్నర్ అబ్దుల్ నజీర్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఎమ్మెల్యేగా గెలవలేరంటూ వైసీపీ చేసిన రాద్దాంతం అంతా ఇంతా కాదు. చివరకు బాడీ షేమింగ్‌కు సైతం వెనుకాడలేదు. ఇష్టానుసారంగా లోకేష్‌పై విమర్శలు గుప్పించారు. వాటన్నింటికీ ఈ ఎన్నికల్లో నారా లోకేష్ తన విజయంతో సమాధానం చెప్పారు. వైసీపీ నేతలెవ్వరికీ మాటల్లేకుండా చేశారు. తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఎమ్మెల్సీగా ఆపై.. మంత్రి పదవి చేపట్టారంటూ వైసీపీ చేసిన ఎద్దేవాకు గట్టి సమాధానం నారా లోకేష్ చెప్పారు. మంగళగిరి నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## సమర్థత మేరకు శాఖలు కేటాయింపు

స్వీకారం చేసిన మంత్రులకు శాఖలు కేటాయిస్తా

ఇచ్చిన శాఖకు న్యాయం చేయాల్సిన బాధ్యత మీదే

కొత్త మంత్రులతో భేటీలో చంద్రబాబు

అమరావతి: ఏపీ మంత్రుల అభీష్టం, సమర్థత మేరకు వారికి శాఖలు కేటాయిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖలు కేటాయిస్తా అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇచ్చిన శాఖకు పూర్తి స్థాయి న్యాయం చేయాల్సిన

మిగతా 2లో..



## నేటి సాయంత్రం సిఎం చంద్రబాబు బాధ్యతల స్వీకరణ

సచివాలయంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కొత్తమంత్రులతో ఉండవల్లి నివాసంలో చర్చలు

గత ప్రభుత్వ అక్రమాలపై శ్వేతపత్రం విడుదలచేసే యోచన

అమరావతి,జూన్12(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన చంద్రబాబు గురువారం సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో అధికారులు ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రెండో సంతకం, పింఛను రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం, స్కిల్ సైన్సెస్‌పై

మిగతా 2లో..

## కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

భవనంలో ఎగిసిపడ్డ మంటలు

41 మంది భారతీయులు సజీవ దహనం

కువైట్ మృతుల కుటుంబాలకు మోడీ సంతాపం



కువైట్,జూన్12(షణ్ముఖవెలుగు): కువైట్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ భవనంలో మంటలు చెలరేగడంతో 43 మంది సజీవ దహనమయ్యారు. మృతుల్లో 10 మంది మరణించగా.. వారిలో ఐదుగురు భారతీయులు ఉండగా.. వారంతా కేరళకు చెందినవారుగా తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కువైట్ లోని అహ్మదీ గవర్నరేట్ లోని మంగాఫ్ బ్లాక్ లో 6 అంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. నివేదికల ప్రకారం మృతుల్లో ఐదుగురు మలయాళీలు ఉన్నారు. మరో 40 మంది గాయపడ్డారు. అక్కడి కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు లేబర్ క్యాంపులోని కింది అంతస్తులోని ఒక వంటగదిలో మంటలు చెలరేగాయి. అవి క్రమంగా అపార్ట్మెంట్ లోని అన్ని గదులకు వ్యాపించాయి. కొందరు ప్రాణాలను దక్కించుకునేందుకు అగ్నిప్రమాదాన్ని గమనించి బయటకు దూకడంతో మరణించినట్లు స్థానిక

మిగతా 2లో..

## అరుణాచల్ నేతగా పెమా ఖండూ ఎన్నిక

నేడు సిఎంగా ప్రమాణం చేయనున్న ఖండూ

ఇటానగర్,జూన్12(షణ్ముఖవెలుగు): బీజేపీ నేత పెమా ఖండూ అరుణాచల్ ప్రదేశ్ బీజేపీ లెజిస్లేచర్ పార్టీ నేతగా బుధవారంనాడు తిరిగి ఎన్నికయ్యారు. దీంతో మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. భారతీయ జనతా పార్టీ కేంద్ర పరిశీలకులైన రవిశంకర్ ప్రసాద్, తరుణ్ చుగ్ సమక్షంలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు


మిగతా 2లో..



## విధ్వంస పాలన నుంచి.. పునర్నిర్మాణం దిశగా..

ఎపిలో కొలువుదీరిన చంద్రబాబు ప్రభుత్వం

విజనరీ బాబుతోనే ఎపికి రక్ష అన్న నమ్మకంలో జనం



అమరావతి,జూన్12(షణ్ముఖవెలుగు): ఎంతో ఉత్కంఠగా సాగిన అసెంబ్లీ ఎన్నికల్లో అసాధారణ విజయం సాధించి... నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన దార్శనికుడు.. చంద్రబాబు. ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో అధికారం కోల్పోయి ..కేవలం 23 స్థానాలకు పరిమితమైన దశ నుంచి... జగన్ వంటి అరాచక, విధ్వంసకర పాలకుడికి ఎదురొడ్డి పోరాడి, చంద్రబాబు అద్భుత విజయం సాధించారు. జైలుకెళ్లినా, కేసులతో ఇబ్బందులు పెట్టినా మొక్కవోని దీక్షను ప్రదర్శించారు. ప్రజల్లో మళ్లీ విశ్వాసం కలిగించి, మిత్రపక్షాలతో కలసి 164 స్థానాలు గెలుచుకుని నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. నవ్యాంధ్ర సారథిగా పాలనా పగ్గాలు స్వీకరించారు. దీంతో ఇప్పుడు అమరావతి, పోలవరం సాధిస్తామన్న నమ్మకాన్ని కలిగించారు. దూరంపెట్టిన ప్రధాని మోడీ కూడా దగ్గర కావడం చంద్రబాబు దక్షతకు నిదర్శనంగా చెప్పుకోవాలి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో చంద్రబాబు అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. కిందపడిన ప్రతిసారీ అంతే ఉత్సాహంతో పోరాటం ప్రారంభించి మళ్లీ గెలిచి చూపించారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదటి నాలుగు

మిగతా 2లో..

## మంత్రివర్గ సహచరులు 24 మంది ప్రమాణం

పలువురు సీనియర్లకు దక్కని చోటు

సమీకరణాలతో పక్కన పెట్టిన బాబు

విజయవాడ,జూన్12(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసారు. ఈ నేపథ్యంలో చంద్రబాబుతోపాటు రాష్ట్ర మంత్రులుగా మూడు పార్టీలకు చెందిన వారు ప్రమాణస్వీకారం చేసారు. అయితే ఆ జాబితాలో మంత్రి పదవులను ఆశించిన పలువురు సీనియర్‌లు నిరాశే మిగిలింది. ఎందుకంటే తమకు

మిగతా 2లో..






# ఏపీలో చంద్రోదయం

మొదటిపేజీ తరువాయి..

తదితరులు వచ్చారు. చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రులుగా ప్రమాణం చేశారు. చంద్రబాబుతో పాటు మరో 24 మంది చేత గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. మంత్రివర్గ కూర్పులో భాగంగా జనసేన నుంచి ముగ్గురు, భాజపా నుంచి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సీనియర్లకు, యువతకు మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించారు. ఇందులో 17 మంది కొత్తవారే కావడం గమనార్హం. ముగ్గురు మహిళలకు చోటు లభించింది. బీసీలు ఎనిమిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరికి, వైశ్యుల నుంచి ఒకరికి అవకాశం దక్కింది. నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు అవకాశమిచ్చారు. తెదేపా నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రివర్గంలో చేరారు. జనసేన నుంచి పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రివర్గంలో చోటు దక్కించు కున్నారు. భాజపా నుంచి సత్యకుమార్ యాదవ్‌కు అవకాశం దక్కింది. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో... పవన్ కల్యాణ్ (జనసేన), నారా లోకేశ్ (తెదేపా), అచ్చెన్నాయుడు (తెదేపా),కొల్లు రవీంద్ర (తెదేపా), . నాదెండ్ల మనోహర్ (జనసేన),పి. నారాయణ (తెదేపా), వంగలపూడి అనిత (తెదేపా), సత్యకుమార్ యాదవ్ (భాజపా),నిమ్మల రామానాయుడు (తెదేపా), ఎన్.ఎమ్.డి ఫరూక్ (తెదేపా), ఆనం రామనారాయణరెడ్డి (తెదేపా), పయ్యావుల కేశవ్ (తెదేపా), అనగాని సత్యప్రసాద్ (తెదేపా),కొలుసు పార్థసారథి (తెదేపా), డోలా బాలవీరాంజనేయస్వామి (తెదేపా),గొట్టిపాటి రవి (తెదేపా), కందుల దుర్గేశ్ (జనసేన), గుమ్మిడి సంధ్యారాణి (తెదేపా), బీసీ జనార్దన్‌రెడ్డి (తెదేపా), టీజీ భరత్ (తెదేపా),ఎస్.సవిత (తెదేపా), వాసంశెట్టి సుభాష్ (తెదేపా), కొండపల్లి శ్రీనివాస్ (తెదేపా), మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి (తెదేపా) ఉన్నారు. ప్రమాణం చేసిన వారంతా తెలుగులోనే దైవసాక్షిగా ప్రమాణాం చేశారు. ఎన్ఎండి ఫరూక్ తెలుగులోనే అల్లా సాక్షిగా ప్రమాణం చేశారు. టిజి భరత్ ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ఒక్కొక్కరే ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, ఇతర పెద్దలకు అభివాదం చేశారు. చంద్రబాబు పలువురిని మోడీకి పరిచయం చేశారు. పవన్ కళ్యాణ్ వేదికపై అందరికి అభివాదం చేసి, తన అన్న చిరంజీవికి మాత్రం పాదాభివందనం చేశారు.

## సమర్థత మేరకు శాఖలు కేటాయింపు

మొదటిపేజీ తరువాయి..

బాధ్యత వారిపై ఉంటుందన్నారు. చంద్రబాబు తన కొత్త మంత్రివర్గంతో ఉండవల్లిలోని ఆయన నివాసంలో సాయంత్రం సమావేశం అయ్యారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం అయిన పవన్ కల్యాణ్ మాత్రం వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేదని సమాచారం. వచ్చే ఐదేళ్లు పరిపాలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. గతంలో తాను సీఎంగా ఉన్నప్పటి పరిస్థితి, ఈరోజు ఉన్న పరిస్థితిని రాష్ట్ర మంత్రులకు చంద్రబాబు వివరించారు. తమకు మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు మంత్రులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులకు శాఖలు ఫైనల్ కానున్నట్లు తెలిసింది. చంద్రబాబుతో సమావేశంలో నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, పి.నారాయణ, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, ఎన్ ఎమ్ డీ ఫరూక్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డోలా బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, కందుల దుర్గేశ్, టీజీ భరత్, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, బీసీ జనార్ధన్రెడ్డి, మండిపల్లి రామ్ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి సాయంత్రం సిఎం చంద్రబాబు బాధ్యతల స్వీకరణ

మొదటిపేజీ తరువాయి..

నాలుగో సంతకం, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై ఐదో సంతకం చేయనున్నారు. దీనికి సంబంధించిన దస్త్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రమాణ స్వీకారం తర్వాత ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులతో చంద్రబాబు సమావేశమయ్యారు. మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు ఈ సందర్భంగా మంత్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈరోజు సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి సీఎం తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనం అనంతరం గురువారం అమరావతి చేరుకుంటారు. ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల వైసీపి పాలనలోజరిగిన అవకతవకలు, విధ్వంసంపై టీడీపీ ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేయనుంది. రాష్ట్రంలో విధ్వంసంపై శాఖల వారీగా విడుదల చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అక్రమాలపై వరసగా శ్వేతపత్రాలు విడుదల చేయనున్నారు. రాష్ట్ర విభజనకు పూర్వం కాంగ్రెస్ హయాంలో జరిగిన విధ్వంసాలపైనా 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇలాగే స్వేతపత్రాలు విడుదల చేసింది. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో చర్చ మెదలైంది. వైసీపీ హయాంలో ఇసుక, మద్యం పాలసీలపై అప్పటి ప్రతిపక్షాలు విపరీతంగా ఆరోపణలు చేశాయి. ఇసుక ఇష్టానుసారం తోడేస్తున్నారని, కల్తీ మద్యాన్ని ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. గనుల శాఖలోనూ పలు అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ప్రస్తుతం శ్వేతపత్రాలు విడుదల చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు బయటపడనున్నాయో వేచి చూడాల్సిందే.

## అరుణాచల్ నేతగా పెమా ఖండూ ఎన్నిక

మొదటిపేజీ తరువాయి..

సమావేశమై పెమా ఖండూను లెజిస్లేచర్ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఎంపీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా హాజరయ్యారు. లెజిస్లేచర్ పార్టీ నేతగా ఎన్నికైన పెమా ఖండూ సీఎం పదవిని చేపట్టనుండటం వరుసగా ఇది మూడోసారి కానుంది. ఈనెల 13వ తేదీ గురువారంనాడు తన క్యాబినెట్ మంత్రులతో కలిసి ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. పెమా ఖండూ తొలిసారి 2016లో సీఎం అయ్యారు. కాగా, ఇటీవల ముగిసిన అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 60 స్థానాలకు గాను బీజేపీ 46 సీట్లు గెలుచుకుని తమ సత్తా చాటుకుంది.
























## ఒడిషాలో సిఎంగా తొలి గిరిజన నేత

మొదటిపేజీ తరువాయి..

ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. వీరితోపాటు మంత్రులుగా సురేశ్ పుజారి, రబీనారాయణ్ నాయక్, నిత్యానంద గోండ్, కృష్ణ చంద్ర పాత్ర ప్రమాణం చేశారు. గవర్నర్ రఘుబర్‌దాస్ చేతులమీదుగా ఈ కార్యక్రమం జరిగింది. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,పలువురు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రు



లతో పాటు ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ కూడా హాజరయ్యారు. అంతకుముందు తాజా మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌తో మోహన్ చరణ్ భేటీ అయ్యారు. నవీన్ నివాస్‌కు వెళ్లిన ఆయన ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని నవీన్‌ను స్వయంగా ఆహ్వానించారు. ఈ క్రమంలోనే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నవీన్ హాజరయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 78 స్థానాల్లో విజయం సాధించిన భాజపా.. రాష్ట్రంలో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తున్న సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే, గిరిజన నేత మోహన్ చరణ్ మాఝి రైతు బిడ్డ. ఆయన తండ్రి సెక్యూరిటీ గార్డుగానూ పని చేశారు. 1997 నుంచి 2000 వరకు సర్పంచిగా పనిచేసిన మాఝి.. 2000లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. భాజపా గిరిజన మోర్చాకు ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. న్యాయశాస్త్ర పట్టభద్రుడైన ఆయన... కేంఝర్ అసెంబ్లీ స్థానం నుంచి నాలుగుసార్లు 2000, 2009, 2019, మళ్లీ 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 నుంచి 2024 వరకూ శాసనసభలో భాజపా సభాపక్ష కార్యదర్శిగా, చీఫ్ విప్‌గా విధులు నిర్వహించారు.

## విధ్వంస పాలన నుంచి.. పునర్నిర్మాణం దిశగా..

మొదటిపేజీ తరువాయి..

దశాబ్దాలు ఒకెత్తు... గడచిన ఐదేళ్లూ ఒకెత్తు. గతంలో ఎందరో కాకలు తీరిన నాయకులతో కలిసి పనిచేశారు. మహామహా యోధుల్ని ఢీకొట్టారు. రాజకీయ పోరాటాలు, గెలుపోటములు ఆయనకు కొత్తకాదు. ఏమాత్రం రాజకీయ పరిపక్వత లేని జగన్ వంటి నాయకుడి ఐదేళ్ల పాలనలో... చంద్రబాబు గతంలో ఎన్నడూ లేనన్ని అవమానాలు, కక్షసాధింపులు ఎదుర్కొన్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారుల ఆర్థిక మూలాల్ని, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు జగన్ ఐదేళ్లూ విశ్వప్రయత్నం చేశారు. 1978లో 28 ఏళ్ల వయసులో ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభలో ప్రవేశించాక ఇప్పటి వరకు... ఆయన 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం అత్యంత స్ఫూర్తిదాయకం. 1995లో తెదేపాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో... సెప్టెంబరు 1న ఆయన ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు దఫాలు, నవ్యాంధ్రకు ఒకసారి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన... ఇప్పుడు నాలుగోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా, పదిహేనేళ్లు ప్రతిపక్షనేతగా పనిచేయడం రాష్ట్ర చరిత్రలో ఇప్పటికీ రికార్డే! ఆయన సాధించిన విజయాల్ని తరచి చూస్తే... వాటి వెనుక ఎన్నో త్యాగాలు, అవిశ్రాంత కృషి, క్రమశిక్షణ కనిపిస్తాయి. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన చంద్రబాబు యూనివర్సిటీ రాజకీయాల్లో చురుకైన పాత్ర నిర్వహించారు. 1978లో చిత్తూరు జిల్లా చంద్రగిరి నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1980లో అంజయ్య మంత్రివర్గంలో స్థానం పొందారు. 1980–83 మధ్య పురావస్తు, సినిమాటోగ్రఫీ, సాంకేతిక విద్య, పశు సంవర్థకశాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి, చిన్ననీటి పారుదల వంటి శాఖల్ని సమర్థంగా నిర్వహించారు. 1981లో ఎన్టీఆర్ తన కుమార్తె భువనేశ్వరితో ఆయనకు వివాహం జరిపించారు. ఎన్టీఆర్ తెదేపాను స్థాపించాక... తొలి ఎన్నికల్లో చంద్రబాబు కాంగ్రెస్ తరఫున చంద్రగిరిలోనే పోటీచేసి ఓడిపోయారు. అనంతరం తెదేపాలో చేరి తన రాజకీయ దక్షత, సునిశిత



మేధతో ఎన్టీఆర్‌కు కుడిభుజంగా మారారు. ఆగస్టు సంక్షోభంలో ఆయనకు వెన్నంటి నిలిచి, ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో క్రియాశీలంగా వ్యవహరించారు. 1989లో కుప్పం నియోజకవర్గానికి మారిన ఆయన అప్పటినుంచీ అప్రతిహతంగా గెలుస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో తెదేపా నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయించారు. భౌతిక దాడులు, హింసాకాండ యథేచ్ఛగా సాగాయి. తెదేపా కేంద్ర కార్యాలయంపై వైకాపా మూకలు దాడికి తెగబడి, విధ్వంసం సృష్టిస్తే అప్పటి ప్రభుత్వం ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. చంద్రబాబు వయసు, రాజకీయ అనుభవానికి కనీస గౌరవం ఇవ్వకుండా... వైకాపా ఎమ్మెల్యేలు వెకిలి మాటలు, వ్యక్తిగత దూషణలతో చెలరేగిపోతుంటే... నిరోధించాల్సిన జగన్ వెకిలి నవ్వులతో ప్రోత్సహించినా ఆయన సహించారు. చివరకు అసెంబ్లీలో అవమానాలు భరించలేక మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడతానని శపథం చేసి బయటకు వచ్చేశారు. ఆయనపై జగన్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి...52 రోజులు జైల్లో పెట్టినా మౌనంగా భరించారు. ఇన్ని అవమానాలు, దాడులు ఎదురైనా చెక్కుచెదరని స్థైర్యంతో పోరాడి ఈ ఎన్నికల్లో వైకాపా మూకల్ని మట్టికరిపించారు. పార్టీ చరిత్రలోనే అనన్య సామాన్యమైన విజయాన్ని సాధించి పెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రలకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రజలకు కొత్త తరహా పాలనను పరిచయం చేశారు. శ్రమదానం, ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, పచ్చదనం–పరిశుభ్రత, గ్రామీణ మహిళల ఆర్థిక అభ్యున్నతికి డ్వాక్రాసంఘాల ఏర్పాటు, రైతుబజార్ల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఆయన స్థాపించిన స్వయం సహాయక సంఘాలు గ్రామీణ పేద మహిళల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. డ్వాక్రా సంఘాల విజయ గాథలు తెలుసుకోవడానికి దేశ, విదేశీ ప్రముఖులు రాష్ట్రాన్ని సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన మహిళా ఆర్థిక స్వావలంబన గురించి బ్రిటన్ పార్లమెంటులో ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'పనిచేసే ముఖ్యమంత్రి' అన్న పేరు చాలా త్వరగా వచ్చింది. భారీ వర్షాలు, తుపానుల వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు 24 గంటల్లోపే అక్కడికి చేరుకుని పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేంతవరకు దగ్గరుండి పర్యవేక్షించిన ముఖ్యమంత్రిని ఆయనకు ముందు ఎవరినీ చూడలేదు. 1996లో కోనసీమను భారీ తుపాను అతలాకుతలం చేసినప్పుడు, ఆయన నవ్యాంధ్ర పగ్గాలు చేపట్టాక హుద్‌హుద్, తిత్లీ వంటి తుపానులు ఉత్తరాంధ్రలో బీభత్సం సృష్టించినప్పుడు ఆయన వారం, పది రోజులపాటు అక్కడే మకాం వేసి పరిస్థితి చక్కదిద్దాకే వెనుతిరిగారు.అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకం చేసుకుంటూ పరిపాలనను పరుగులు పెట్టించారు. సంక్షోభం నుంచి అవకాశాలు సృష్టించుకోవాలన్నది చంద్రబాబు తరచూ చెప్పే మాట..! ఉమ్మడి ఆంధప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉ ఒడగా... రాష్ట్ర అభివృద్ధికి విజన్–2020 తయారుచేశారు. విద్య ఒక్కటే పేదరికాన్ని పారదోలే ఆయుధమని గ్రహించి.. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటుచేశారు. ఆ తర్వాత కాలంలో హైదరాబాద్ ఐటీ హబ్‌గా మారడానికి, ఉమ్మడి ఆంధప్రదేశ్ నుంచి వేలసంఖ్యలో ఐటీ నిపుణులు తయారవడానికి దోహదం చేసింది. హైదరాబాద్ నగరాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా, ఐటీ హబ్‌గా మార్చడంతో పాటు, ఐఎస్‌బీ, ఐఐఐటీ వంటి అనేక అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థల్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ వంటి మహా నగరాన్ని కోల్పోయి, ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు లేక, ఆర్థిక లోటుతో భవిష్యత్తుపై అనిశ్చిత పరిస్థితుల్లో... రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన పడే తపన.... రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడతాయని ప్రజలు బలంగా నమ్మారు. 2014లో రాష్ట్ర పాలనా పగ్గాలు ఆయనకు కట్టబెట్టారు. చంద్రబాబు అహరహం శ్రమించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి అంకురార్పణ చేసి, నిర్మాణం పరుగులు పెట్టించారు. పట్టిసీమ ప్రాజెక్టును శరవేగంగా పూర్తిచేశారు. కరవు సీమ... రాయలసీమకు సాగునీరు అందించారు. పట్టుబట్టి పోలవరం ప్రాజెక్టును 70 శాతానికి పైగా పూర్తిచేశారు. గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పించారు. కియా వంటి భారీ పరిశ్రమల్ని, రూ.వేల కోట్ల పెట్టుబడుల్ని తెచ్చారు. అంతర్జాతీయంగా రాష్ట్రానికి ఒక మంచి బ్రాండ్ ఇమేజ్ కల్పించారు. రాజకీయ నాయకుల్లో ఐటీ జ్ఞానిగా, ఈ–గవర్నెన్స్‌ను ప్రజలకు పరిచయం చేసిన దార్శనికుడిగా ఆయనకు పేరుంది. ఆయన సీఎంగా ఉండగానే అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్, బ్రిటన్ ప్రధాని టోనీ ÷–లబెయిర్, సింగపూర్ ప్రధాని, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ వంటివారు ఆంధప్రదేశ్‌ను సందర్శించారు. బిల్‌గేట్స్ వెంటపడి, ఒప్పించి మైక్రోసాఫ్ట్ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించేలా చంద్రబాబు చేసిన కృషి అందరికీ తెలిసిందే..!

## మంత్రివర్గ సహచరులు 24 మంది ప్రమాణం

మొదటిపేజీ తరువాయి..

తప్పకుండా మంత్రి పదవి దక్కుతుందని అని భావించిన పలువురు సీనియర్‌లకు తాజా జాబితాలో చోటు దక్కలేదు. వారిలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, అయ్యన్నపాత్రుడు, ధూళిపాళ్ల నరేంద్ర, గంటా శ్రీనివాసరావు, యరపతినేని, బొండా ఉమ, గద్దె రామ్మోహన్,



బాలకృష్ణ, పరిటాల సునీత, కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, కన్నా లక్ష్మీ నారాయణ, జివి ఆంజనేయులు, కూన రవి తదితరులు ఉన్నారు. వీరితోపాటు అస్మిత్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మాజీ మంత్రి కొండ్రు మురళితోపాటు రాష్ట్రంలోనే భారీ మెజార్టీతో గెలిచిన పల్లా శ్రీనివాసరావుకు కూడా అవకాశం దక్కలేదు. ఉండినుంచి గెలిచిన రఘురామకృష్ణం రాజు కూడా ఉన్నారు. అయితే స్పీకర్‌తో పాటు, డిప్యూటి స్పీకర్, విప్ పదవులు కొందరికి దక్కే ఛాన్స్ ఉంది.



## కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

మీడియా వెల్లడించింది. మరికొందరు పొగ పీల్చడంతో, కాలిన గాయాలతో ఊపిరాడక మరణించారు. ఈ ప్రమాదంలో గాయపడినవారు అదాన్, జాబర్, ముబారక్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం సంభవించిన భవనంలో ఎక్కువగా తమిళనాడు, కేరళ, ఉత్తర భారత ప్రజలు నివసిస్తున్నారు. కువైట్ అగ్నిప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. “కువైట్ నగరంలో జరిగిన అగ్నిప్రమాదం బాధాకరం. నా ఆలోచనలు తమ సన్నిహితులను, ప్రియమైన వారిని కోల్పోయిన వారందరిపై ఉ న్నాయి. క్షతగాత్రులు కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. బాధితులకు సహాయం చేయడానికి అక్కడి అధికారులతో కలిసి పని చేస్తోంది” అని మోడీ చెప్పారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ఉమ్మడి ప్రకాశంకు ఇద్దరు మంత్రులు



**గొట్టిపాటి రవి.... డోలా**
**శ్రీ బాల వీరాంజనేయ స్వామి**
**జిల్లా అభివృద్ధి పై మార్కుపడనుందన్న ప్రచారం**
**హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు**
**అభివృద్ధిలో జిల్లాను ముందుకు**
**తీసుకెళతామంటున్న మంత్రులు**



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 12)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సైతం 12 నియోజకవర్గాలుండగా దర్శి, యర్రగొండపాలెం మినహా మిగతా 10 నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలుపొందారు. దీంతో జిల్లాలో మంత్రి పదవులు ఆశించే వారు సైతం అధికమయ్యారు. అయితే ఆశావాహులు పెరిగినప్పటికీ వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టిన ఎమ్మెల్యేలను సామాజిక తరగతుల వారీగా ఉన్న ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కట్టబెట్టాలని అధిష్టానం యోచించింది. ఇదే క్రమంలో బుధవారం రాష్ట్ర రాజధాని నడిబొడ్డున గల గన్నవరం విమానశ్రయం సమీపంలో గల కేసరపల్లి ప్రాంగణంలో అతిరథమహారథుల సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాల్గవ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేశారు. కూటమిలో సభ్యులైన జనసేన అధినేత కొణిదల పవన్‌కళ్యాణ్ సైతం మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ క్రమంలో మంగళవారం అర్థరాత్రి వరకు ఎవరిని మంత్రులుగా ఎంపిక చేశారో తెలియక ఆశావాహులు ఉత్కంఠకు గురయ్యారు. ఎట్టకేలకు మంత్రిగా అవకాశం ఇచ్చాం...ప్రమాణస్వీకారానికి రావాల్సిందిగా సిఎంఓ కార్యాలయం నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి లకు ఫోన్‌లు వచ్చాయి. దీంతో వారిద్దరూ రాష్ట్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

**గొట్టిపాటి రవికుమార్ ప్రస్థానం ఇలా.....**

గొట్టిపాటి రవికుమార్ విషయానికొస్తే గతంలో మార్టూరు నుంచి రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన ఆయన డీలిమిటేషన్‌లో మార్టూరు కనుమరుగు కావడంతో అద్దంకికి మారారు. అద్దంకి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నాలుగు సార్లు విజయం సాధించారు. గతంలో కాంగ్రెస్, వైసీపీ నుంచి గెలిచిన ఆయన 2019, 2024లలో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసి గెలుపొందారు. భారీ మెజార్టీతో ఐదో సారి విజయం సొంతం చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో గొట్టిపాటి రవి కుమార్ ను వైసీపీ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆర్థిక వేధింపులకు గురి చేసింది. క్వారీలను మూసేయించింది. ఫ్యాక్టరీలకు నష్టం చేశారు. జిల్లాలోని కొందరు వైసీపీ నేతల ప్రోద్బలంతోనే ఇదంతా జరిగింది. అయితే ఆయన అన్నింటినీ తట్టుకుని నిలబడ్డారు. ఇబ్బందులను భరించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఆయన కీలక భూమిక పోషించారు. పార్టీలో ఉన్న ఇన్‌ఛార్జిలందరూ తక్కువ వయస్సు ఉన్న వారే. వీరందరిని నడిపించడంలో క్రియాశీలకంగా ఉన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రలో గొట్టిపాటి రవి కుమార్ పాత్ర కీలకంగా ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు వద్ద గొట్టిపాటి రవికుమార్ మంచి ప్రాధాన్యతను పొందారు. ఈ ఎన్నికల్లోనూ ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపులోనూ తెరచాటు వ్యూహాల్లోనూ కీలకంగా ఉన్నారు. ఈ కారణాల రీత్యా ఆయనకు మంత్రి పదవి దక్కింది. గొట్టిపాటి రవికుమార్ స్వతహాగా గ్రానైట్ వ్యాపారి. 2004లో ప్రకాశం జిల్లా మార్టూరు నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసి తొలి సారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009 లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో మార్టూరు రద్దు అవడంతో అద్దంకికి మారి అక్కడ నుంచి విజయం సాధించారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి మరో సారి ఎమ్మెల్యే అయ్యారు. 2016లో తెలుగుదేశం పార్టీలో చేరి 2019, 2024 ఎన్నికల్లో టీడీపీ తరుపున గెలిచారు. కరణం బలరామకృష్ణమూర్తి వర్గానికి గొట్టిపాటి వర్గానికి పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇది పూర్వం నుంచి వస్తూనే ఉంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి వైసీపీకి దగ్గర అవడంతో గొట్టిపాటి రవికుమార్ టీడీపీకి దగ్గర కావాల్సి వచ్చింది. ఏది ఏమైనా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీలో బలమైన నేతగా ఎదిగిన గొట్టిపాటి రవికుమార్ కు చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో చోటు దక్కింది....తొలి సారి మంత్రి అయ్యారు.

**డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రస్థానం ఇలా....**

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఎస్సీ మాల సామాజికవర్గానికి చెందిన నేత. మొదటి నుంచి తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ కల్గిన కార్యకర్తగా ఎదిగారు. పార్టీకి నిబద్ధతతో ఉన్న ఎమ్మెల్యేగా పేరుంది. వరుసగా రెండు సార్లు గెలిచిన ఆయనను మూడో సారి ఓడించాలని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గెలిచి ఐదు సంవత్సరాలు పూర్తి కాలం మంత్రిగా పని చేసిన డాక్టర్ ఆదిములపు సురేష్‌ను కొండపికి మార్చి జరిగిన ఎన్నికల్లో డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పై పోటీ చేయించారు. అప్పట్లోనే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు యర్రగొండపాలెం చెత్త కొండపిలో బంగారం అవుతుందా అని బహిరంగంగానే చురకలు వేశారు. దీంతో సర్వేల మీద సర్వేలు చేయించుకున్న వైసీపీ ప్రత్యేకంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని నియోజకవర్గానికి రప్పించి రాజకీయ సభను సైతం నిర్వహించారు. అయినప్పటికీ టీడీపీ ఎత్తుల ముందు వైసీపీ చిత్తు అయ్యింది. దామచర్ల సత్య, ఇతర ప్రముఖ నేతల సారథ్యంలో డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ముచ్చటగా మూడో సారి వైసీపీ అభ్యర్థి ఆదిములపు సురేష్ పై భారీ మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ సాధించారు. దీంతో ఎస్సీ మాల సామాజికవర్గం నుంచి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామికి మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారం ముందే ఊపందుకుంది. ఈ క్రమంలోనే ఓటమి ఎరుగని మంత్రి సురేష్‌ను ఓడించిన నేతగా పేరు తెచ్చుకున్నారు. మంత్రి మండలిలో స్థానం సంపాదించుకున్నారు. ఆయన 1997లో ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి ఎంబిబిఎస్ పూర్తి చేశారు. నేరుగా టీడీపీ నుంచే రాజకీయాలకు ఎంట్రీ ఇచ్చారు. 2009లో కొండపి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014 జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. 2015లో టిటిడి పాలక మండలి సభ్యునిగా పని చేశారు. 2019లో రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2024లో ముచ్చటగా మూడో సారి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించి మంత్రి మండలిలో స్థానం సంపాదించారు. ఆయన కొండపి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ వైద్యునిగా కూడా పని చేశారు. మాజీ మంత్రి స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చారు. 2019 నుంచి నిన్నటి వరకు తెలుగుదేశం పార్టీ శాసనసభా పక్షానికి విప్‌గా వ్యవహరించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు.

**ఇద్దరూ ఇద్దరే....**

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఇద్దరూ ఇద్దరే...మంచి క్రమశిక్షణ గల నేతలు. మాటకు విలువ ఇచ్చే వారు. దీంతో వీరిద్దరి సారథ్యంలో జిల్లా అభివృద్ధి తప్పక జరుగుతుందని టీడీపీ సీనియర్ నేతలతో పాటు జిల్లా ప్రజలు సైతం విశ్వసిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రులిద్దరూ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి ఎన్నో హామీలిచ్చిందన్నారు.

వాటిని తుంగలో తొక్కిందని చెప్పారు. నిమ్జ్, దొనకొండ కారిడార్, ఒంగోలు ట్రిపుల్ ఐటి, ఇలా ఎన్నో సమస్యలు జిల్లాను పట్టి పీడిస్తున్నాయన్నారు. వాటన్నింటిని అభివృద్ధి పరచి అభివృద్ధిలో జిల్లాను ముందు వరుసలో ఉంచుతామని చెప్పారు.

# పనితీరుకు పట్టం



**నెల్లూరు నుంచి ఇద్దరికి మంత్రి పదవులు**
**మంత్రులుగా కలిసొచ్చిన గత అనుభవం**
**రాజధాని నిర్మాణంలో నారాయణ కీలకపాత్ర**
**ఉద్ధండుల వద్ద సీనియర్ మంత్రిగా ఆనం సేవలు**
**చంద్రబాబు కేబినెట్‌లో ఏ శాఖ కేటాయిస్తారో?**
**ఆసక్తిగా ఎదురుచూపు చూస్తున్న ప్రజానీకం**

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, నెల్లూరు, జూన్ 12)**

నెల్లూరు జిల్లా నుంచి ఇద్దరికి మంత్రులుగా అవకాశం దక్కింది. నెల్లూరు సిటీ నుంచి విజయం సాధించిన (తరువాయి 4లో...)

# పొంగూరు నారాయణ అనే నేను...



**రెండోసారి ఆంధ్ర రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం**


**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 12)**

పొంగూరు నారాయణ అనే నేను... శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని, (తరువాయి 4లో...)

# పైన పటారం లోన లొటారం..!!

**నర్సరీల మోసంతో నష్టపోతున్న మిర్చి రైతులు**

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జూన్ 12)**



పైన పటారం లోన లొటారం అన్నట్లుంది యర్రగొండపాలెం నియోజకవర్గంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన నర్సరీల సంగతి. పైకి చూపించేది ఒకటి విత్తనం..లోపల ఉండేది మాత్రం నాశిరకం విత్తనం. ఇలా మోసం చేస్తూ కొనసాగించే నర్సరీలకు అనుమతులు, రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు మాటంటే అంతే సంగతులు. ఇప్పటికి యర్రగొండపాలెం నియోజకవర్గంలో 102 నర్సరీలు దర్శనమిస్తున్నాయి. వీటిల్లో 72 నర్సరీలకు మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. మిగతా నర్సరీలు ప్రభుత్వం చేత గుర్తింపు పత్రాలు, రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని చట్టాలు ఉన్నా వాటిని అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారని స్థానిక రైతులు అంటున్నారు. ఈ నర్సరీల్లో కొనుగోలు చేసిన మిరప నారు వల్ల రైతులకు ప్రయోజనం మాటేమో గానీ నష్టం మాత్రం చవిచూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నర్సరీ రిజిస్ట్రేషన్, లైసెన్సు తప్పనిసరి ఉండాలని అలాంటి వారు మాత్రమే ప్రభుత్వ ఉద్యానశాఖ అధికారుల ఆదేశాల మేరకు విత్తనాలు కొనుగోలు చేసి ఆ మొక్కలనే రైతులకు అమ్మాలని అధికారులు చెబుతున్నారు. అలా కొనుగోలు చేసిన విత్తనాల వల్ల రైతులకు పంట దిగుబడి రాకపోయినా, నష్టం వాటిల్లినా నర్సరీ వారు ప్రభుత్వంతో అనుసంధానమై పంటల బీమా ఏర్పాటు చేసుకుని నష్టపోయిన రైతులకు పంటల బీమా వర్తింపచేయాలని ఆదేశాలు ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అయితే నర్సరీలపై ప్రభుత్వ ఆంక్షలు నామమాత్రంగా ఉండటం వల్ల ఇదే అదునుగా భావించిన నర్సరీ యాజమాన్యాలు రైతులను నట్టేట ముంచుతున్నారని కొందరు విమర్శిస్తున్నారు. లైసెన్సులు తీసుకొని అధికారులు నుండి నాణ్యత ప్రమాణాలతో కూడిన ఒక ప్యాకెట్‌ని కొనుగోలు చేసి అవే మొక్కలను అమ్ముతున్నామని నమ్మించి ఒక ప్యాకెట్ నాణ్యమైనదైతే పది ప్యాకెట్లు నాసిరకం వాటిని వాడి రైతుల వద్ద దండుకుంటున్నారు. ప్రస్తుతం మిర్చినారు గిరాకీ ఉండడంతో మొక్క సుమారు రెండు రూపాయల వరకు ధర పలుకుతుంది. గతంలో పోల్చుకుంటే మిర్చినారుకు మంచి లాభాలు వస్తాయి అని ఆశిస్తే తెగులుపట్టి వైరస్ సోకి దుఃఖమే మిగిలింది. (తరువాయి 4లో...)

# పనితీరుకు పట్టం

డాక్టర్ పొంగూరు నారాయణ, ఆత్మకూరు నుంచి జయభేరి మోగించిన ఆనం రామ నారాయణరెడ్డిలు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం, మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఒకే జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం రావడం పట్ల జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పని విధానం, సీనియర్లు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. పొంగూరు నారాయణ 2014 నుండి 2019 వరకూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ ఐదేళ్లు పనితీరుతో తనదైన ముద్ర వేసుకున్నారు. అంతేగాక రాజధాని నిర్మాణంలో నారాయణ కీలక భూమి పోషించారు. ఆయన పనితీరును బట్టే రెండోసారి మంత్రిగా అవకాశం లభించింది అనడం సందేహం లేదు. ఇక ఆనం రామ నారాయణరెడ్డి. ఆయన కూడా సీనియరే. ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య, నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లలో ఆనం మంత్రిగా సేవలందించారు. ప్రభుత్వంలో కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా సేవలందించి తనదైన ముద్ర వేసుకున్నారు. ఆనం రామ నారాయణ రెడ్డి పనితీరు మెచ్చే ఆయనకు చంద్రబాబు మంత్రిగా అవకాశం కల్పించారు. ఈ ఇద్దరికీ పాత శాఖలే కేటాయించే అవకాశం ఉంది. నారాయణకు పురపాలకశాఖ మంత్రిత్వంతో పాటూ రాజధాని నిర్మాణ పనులు, ఆనం రామ నారాయణరెడ్డికి ఆర్థిక మంత్రిత్వాన్నే కేటాయించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

# పొంగూరు నారాయణ అనే నేను...

భయం కానీ, పక్షపాతం కానీ, రాగద్వేషాలు కానీ లేకుండా... రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి ప్రజలందరికి న్యాయం చేకూర్చుతానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ నారాయణ రెండోసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రధాని మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, చంద్రబాబు, పురందేశ్వరిలకు నమస్కరించి ధన్యవాదాలు తెలిపారు. తొలుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా రెండోసారి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. భారీ ఏర్పాట్ల మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరయ్యారు. ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మోడీకి చంద్రబాబుతో కలిసి నారాయణ స్వాగతం పలికారు. అనంతరం మోడీ, చంద్రబాబులతో కలిసి సభాస్థలికి చేరుకున్నారు. గవర్నర్ అబ్దుల్, డాక్టర్ పొంగూరు నారాయణతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ సహా దేశవ్యాప్తంగా పలువురు రాజకీయ, సినీ ఇండస్ట్రీ, ప్రముఖులు హాజరయ్యారు.

# పైన పటారం లోన లొటారం..!!

**అడ్డగోలుగా మిరప మళ్లు..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బయట మిరప మళ్లను ఏర్పాట్లు చేసుకొనే క్రయ విక్రయాలు చేసినట్లయితే చట్టరీత్యా నేరమని చెబుతున్నారే కానీ అవి అమలులో లేకపోవడం వలన దళారులు ఎటువంటి నాణ్యత ప్రమాణాలు లేని విత్తనాలు వేసి మొక్కలను అమ్ముకొని దండుగా రైతన్నలను పిండుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 72 నర్సరీలకు అనుమతులు ఉన్నాయని అధికారులు అంటున్నారు. మిగతా 30 నర్సరీలకు ఇప్పటి దాకా అనుమతులు లేవు. బయట వేసిన మిరప నారుకు సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రంగా నోటీసులు జారీ చేసి చోద్యం చూస్తున్నారు తప్ప ఆ మొక్కలు అమ్మకాలు జరపకుండా అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారు.

**మిర్చికి డిమాండ్ ఉండడంతో..**

శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన సరకుకు క్వింటాకు రూ.25 వేల వరకు ధర పలుకుతుండగా, నాన్ ఏసీ రకానికి సైతం రూ.22 వేల వరకు డిమాండ్ ఉంది. తాలు మిరపకు రూ.13 వేల వరకు ధర పలకడం విశేషం. ఈ ధరలు సైతం నాలుగు నెలల నుంచి నిలకడగా ఉండటంతో రైతులు ఈసారి మిరప సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. భూములకు డిమాండ్ ఏర్పడటంతో కౌలు ధరలకూ రొక్కలచ్చాయి. మిరపకు వచ్చే సీజన్‌లో సైతం డిమాండ్ ఉంటుందని రైతులు భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.25 లక్షల ఎకరాల్లో మిరప సాగు ఉండగా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లోనే 40 వేల ఎకరాల వరకు మిరప విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతుల అవసరాలను ఆసరా చేసుకుని నర్సరీల యాజమాన్యం మోసాలకు పాల్పడే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

# చెరువు పంట కాలువలో పడి వ్యక్తి మృతి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 12)**

మార్కాపురం పట్టణం బోడపాడు రోడ్డులోని చెరువు పంట కాలువలో తర్లుపాడు మండలం బుడ్డ పల్లి గ్రామానికి చెందిన వడ్డెర కులంకు చెందిన బత్తుల బాజీ బాబు తండ్రి బాలయ్య(25) మార్కాపురం పట్టణంలో మంగళవారం రాత్రి మద్యం సేవించి తర్లపాడు మండలం బుడ్డపల్లికి మోటార్ సైకిల్ పై వెళుతూ అదుపుతప్పి మార్కాపురం పట్టణం బోడపాడు రోడ్‌లోని చెరువు పంట కాలువలో మోటార్ సైకిల్‌తో సహా పడ్డారు. దీంతో అతని అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతను మార్కాపూర్ పట్టణంలో గుంటక రామచంద్రారెడ్డి వద్ద జేసీబీ ఆపరేటర్‌గా 2 నెలల నుంచి పనిచేస్తున్నాడు. సంఘటనా స్థలానికి మార్కాపూర్ టౌన్ ఎస్‌ఐ చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలిద్దాం

## మున్సిపల్ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 12)**

బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలిద్దామని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కాశిరెడ్డి ఎస్టీ కాలనీలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల కార్మికుల వ్యవస్థ నిర్ములన పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాలలంతా చదువుకునేలా కృషి చేద్దామన్నారు. బాలలపై సాగుతున్న సాంఘిక అన్యాయాలను వ్యతిరేకిద్దామని, బాల్య వివాహాలు వద్దే వద్దని ప్రతి ఒక్కరికీ చాటి చెబుదామని, బాలల భవిష్యత్తు కోసం అందరూ కలిసి కృషి చేద్దామని అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని చట్టం పై అవగాహన కలిగించారు. చదువుకుంటున్న విద్యార్థులు చదువును



మధ్యలోనే ఆపేసి పనికి వెళితే మీ పాఠశాల ఉపాధ్యాయులకు లేదా ప్రభుత్వ అధికారులకు తెలియజేయండి అని విద్యార్థులకు చెప్పారు.గుర్తించిన బాల కార్మికులను, బాలలను బాలల సంక్షేమ కమిటీ ముందు ప్రవేశపెట్టడం, బాల కార్మిక వృత్తి నుంచి విముక్తులను చేసి వారికి ప్రభుత్వం ద్వారా పునరావాసం కల్పించడం జరుగుతుందన్నారు. పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఈ ఏడాది బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా ఐక్యరాజ్య సమితి ప్రవేశపెట్టిన "మన కట్టుబాట్లపై చట్టం చేద్దాం బాల కార్మికులను అంతం చేద్దాం" అనే థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సామాజిక బాధ్యత అందరూ సహకరించాలని కోరారు. బాలలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత సేవలు గురించి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్ జీఎస్ అండ్ జిడికె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవ కుమార్, కాలనీ వాసులు, బాలలు, తదితరులు పాల్గొన్నారు.

# సంబరాలు చేసుకున్న టీడీపీ నాయకులు






(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 12)

తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ కూటమి అఖండ విజయంతో నాలుగోసారి నారా చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయుచున్న సందర్భంగా నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా గెలిచిన పొంగూరు నారాయణ, ఆత్మకూరు ఎమ్మెల్యేగా గెలిచిన ఆనం రామనారాయణ రెడ్డిలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా 6వ డివిజన్లో అధ్యక్షులు కొండా ప్రవీణ్ శంకర్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, మామిడాల మధు పాల్గొని కేక్ కటింగ్, బాణాసంచా నిర్వహించారు. ఎల్‌ఈడి స్క్రీన్ ద్వారా వీక్షిస్తూ, మిఠాయిలు పంచుతూ ఆరో వార్డులోని అనేక సెంటర్లలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు గుత్తా అన్నపూర్ణ, రామకృష్ణ, సాయికిరణ్, నరహరి, దారపనేని శ్రీహరి, గురు కిషోర్, కేవీఆర్(జనసేన), బీజేపీ నారాయణ, గురుబ్రహ్మం, సేగు షణ్ముగం, బూత్ కన్వీనర్, బిఎల్‌ఏలు, నారాయణ టీం, మహిళా శక్తి, యూత్ టీం, తెలుగుదేశం, బిజెపి, జనసేన అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జూన్ 12)**

అంగన్‌వాడీ కేంద్రాలలో ఆట,పాటలతో కూడిన విద్య నేర్పడం అభినందనీయమని కొండపి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ మాధవి లత అన్నారు. మండల కేంద్రమైన మర్రిపూడి పడమటి బజార్ ఎస్సీ కాలనీ ఓసి ఏరియాలోని అంగన్‌వాడీ సెంటర్లలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ పాల్గొని ప్రసంగించారు. ప్రవేట్ ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్ల కంటే అంగన్వాడి సెంటర్లో మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లో విద్యను పూర్తి చేసుకొని ఎలిమెంటరీ పాఠశాలలో ఒకటో తరగతి చేరుతున్న విద్యార్థిని, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఏర్పాటు చేసి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సుచేరిత, ఐటిసి ప్రదం, వెంకటలక్ష్మి అంగన్వాడి కార్యకర్తలు కె పీ,హైమావతి ఏ,సుధేష్ణ ఎం,కెజియా ఆయాలు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదురుపల్లిలో టీడీపీ నేత చీర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంబరాలు

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 12)**

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా మండలంలోని ఆదురుపల్లిలో సీనియర్ టిడిపి నాయకులు చీర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టిడిపి నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా పేల్చి, భారీ కేక్ కటింగ్ నిర్వహించారు. స్థానికులకు స్వీట్లు పంచిపెట్టారు. చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి, ఆనం రామనారాయణ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చీర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో స్థానం దక్కించుకున్న మంత్రులకు ముఖ్యంగా ఆనం రామనారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ అరాచక ప్రభుత్వంను అంతమొందించి, ప్రజలు రామరాజ్యాన్ని ఎన్నుకున్నారని, కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజల సుభిక్షంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాబోవు ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధి

## వైసీ యోగయ్య యాదవ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)**



బిజెపి, టీడీపీ, జనసేన పార్టీల ఎన్డీఏ కూటమి తరఫున నాల్గోసారి ముఖ్యమంత్రిగా విజయవాడ దగ్గర కేసరపల్లిలో అశేషంగా ప్రజలు పాల్గొన్న సభలో నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ మాట్లాడుతూ ఈ రోజున రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చు కుంటున్నారని, నరేంద్ర మోడీ ప్రోత్సాహంతో చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళతారని, రాష్ట్ర ప్రజలు పూర్తిగా విశ్వసిస్తున్నారన్నారు. రాబోవు ఐదేళ్లలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పదంలో దూసుకెళ్లి భారత దేశంలో అగ్రగామి రాష్ట్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ఒక విజన్ కల్గిన నాయకుడు అని కొనియాడారు ఏది ఏమైనా ప్రధాని మోడీ, చంద్రబాబు నాయుడు పాల్గొన్న సభలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాయపాటి అజయ్, శివరాం, అఫ్రిన్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కులు నెరవేర్చాలి

## కూటమికి ధన్యవాదాలు

## ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శుభాకాంక్షలు

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 12)**

రాష్ట్ర ప్రజలు చరిత్రలో లేని విధంగా చారిత్రాత్మకమైన గొప్ప తీర్పునిచ్చారు. ప్రజాస్వామ్య పాలన పున ప్రారంభమైందని, కూటమి పాలకవర్గం రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజలకు పార్టీలకు అతీతంగా ఒక మంచి పాలన అందించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఐక్యవేదిక పాలకవర్గానికి మనవి చేస్తుందని బుధవారం స్థానిక జర్నలిస్ట్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ కన్వీనర్ పాశం నరసింహారావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలతో పాటు జర్నలిస్టులు కూడా రోడ్డున పడ్డారని, వారికి అనుకూలంగా ఉన్న పత్రికలకు ఛానల్‌కు మాత్రమే యాడ్లు ఇచ్చే వారిని, పత్రికలకు ప్రకటనలు ఇవ్వకుండా పత్రిక రంగాన్ని మీడియా రంగాన్ని కాలరాశారన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రైల్వే పాసులు మళ్లీ పునర్ధించాలని, బయట జిల్లా పేపర్లకు గతంలోలా అక్రిడిటేషన్‌లు ఇవ్వాలని, జిల్లా మండల కేంద్రాల్లో శాశ్వత జర్నలిస్ట్ భవనాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టులు మరణిస్తే ఆ కుటుంబానికి 25 లక్షలు ఆర్థిక సాయం చేసి ఆ కుటుంబాన్ని



ఆదుకోవాలన్నారు. కరోనా టైములో నెల్లూరు జిల్లాలో మరణించిన జర్నలిస్టు కుటుంబాలను ఆదుకొని వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. జర్నలిస్టు పిల్లలకు ప్రభుత్వం ప్రవేటు స్కూళ్లలో కాలేజీల్లో శాశ్వతంగా సబ్సిడీతో కూడిన విద్యను ప్రభుత్వం జీవధార అందించాలన్నారు. 50 దాటిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టులు అందరికీ హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు. పోలీసులకు ఆర్మీ వారికి స్టోర్స్ నాణ్యమైన నిత్యవసర వస్తువులు కుటుంబాలకు కూడా ఏర్పాటు చేయాలన్నారు. చిన్న, పెద్ద పత్రికలకు, యూట్యూబ్ ఛానల్స్‌కు వివక్ష లేకుండా ప్రభుత్వం ప్రకటనలు వచ్చేలా శాశ్వత జీవో ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు సంక్షేమ నిధిని ప్రభుత్వ ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టు కుటుంబాలపై హక్కులపై మూడు నెలల్లో పాలకులు స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు సంఘాలను కలుపుకుని హక్కుల సాధనకై శాంతియుతంగా నిరాహార దీక్షలు చేపడతామని వారు మనవి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కో-కన్వీనర్ ఎం శ్రీహరి, రాష్ట్ర సలహాదారులు ఏ వెంకటేశ్వర్లు, ఎన్ మల్లికార్జునరావు, వి హజరత్, పి శ్రీహరి, రావూరు రమేష్, పి దినేష్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి డాక్టర్ శ్రీ డోలబాల వీరాంజనేయ స్వామికి శుభాకాంక్షలు తెలిపిన పులి ప్రసాద్ యాదవ్, పులి మాలకొండయ్య యాదవ్







(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జూన్ 12)
ప్రకాశం జిల్లా కొండపి తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడిగా వరుసగా మూడుసార్లు కొండపి కోటపై విజయకేతనం ఎగరవేసి హ్యాట్రిక్ సాధించిన కొండపి టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం సంపాదించుకున్న డాక్టర్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామికి ప్రకాశం జిల్లా కొండపి మార్కెటింగ్ యాడ్ మాజీ వైస్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బింగినపల్లి గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకుడు పులి ప్రసాద్ యాదవ్, బింగినపల్లి సాగునీటి చెరువు మాజీ చైర్మన్ పులి మాలకొండయ్య యాదవ్‌లు మంత్రి స్వామికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. మూడుసార్లు ముచ్చటగా హ్యాట్రిక్ సాధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హృదయంలో చెరగని ముద్ర వేసుకుని ఆయన మంత్రివర్గంలో తొలిసారిగా రాష్ట్ర మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి సేవలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున నియోజకవర్గ ప్రజలకే గాక రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు మంత్రి స్వామి సేవలు ఎంతో అవసరం . ఆయన సేవలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అభివృద్ధి బాటలో పయనించే విధముగా ప్రగతి పథంలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాడని పులి ప్రసాద్ యాదవ్, పులి మాల కొండయ్య యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.
ఏది ఏమైనా తొలిసారిగా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామికి పులి ప్రసాద్ యాదవ్, మాలకొండయ్య యాదవ్ ఇటు పార్టీ తరఫున అటు ప్రజల తరఫున ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి పులి ప్రసాద్ యాదవ్, పులి మాలకొండయ్య యాదవ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన రెడ్ క్రాస్ బృందం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 12)
రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడైన కలెక్టర్ దినేష్ కుమార్‌ను రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి బ్లడ్ బ్యాంకు కన్వీనర్ నరసింహారావు క్యాంపు కార్యాలయంలో కలిసారు. ఈ సందర్భంగా జూన్ నెల 14వ తేదీన ప్రపంచ రక్త దాతల దినోత్సవ వేడుకల నిర్వహణపై రెడ్ క్రాస్ చేపట్టనున్న కార్యక్రమాలను ఆదేశించారు. ఈ నెల 14 ఉదయం 10 గంటలకు ప్రకాశం భవన్ స్పందన సమావేశ మందిరం లో రక్తదాన శిబిరం, రక్త దాతలకు సత్కార కార్యక్రమం జరపడానికి నిశ్చయించారు. ఏటా చేసేట్లుగా రక్త దాతల దినోత్సవంలో కలెక్టర్ రక్తదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా జిల్లా ఎస్పీని ఆహ్వానించారు.

## సుంకేసులలో చంద్రబాబు ఫోటోకి క్షీరాభిషేకం



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 12)
మండలంలోని సుంకేసుల గ్రామంలో నాయకులు, మహిళలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోకు పాలాభిషేకం చేశారు. ఏపీ ముఖ్యమంత్రిగా నాల్గోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సీఎం నారా చంద్రబాబు నాయుడు ఫోటోకి పాలాభిషేకం ఘనంగా చేశారు. ఈ కార్యక్రమ ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరావు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుముల ప్రసాద్, ఎంపీటీసీ భూతపాటి సాల్మన్ అబ్రావతి, టిడిపి నాయకులు, భీమవరం సహదేవుడు, వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజలకు జవాబుదారీగా పని చేయాలి

### విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 12)
సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు అంకితభావంతో సమయపాలన పాటిస్తూ ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం కనిగిరి పట్టణంలోని 7వ సచివాలయం ఆకస్మికంగా తనిఖీ సేసి సచివాలయం సిబ్బంది ప్రజలకు సకాలములో అందుబాటులో ఉండి పని చేస్తున్నారా?లేదా?అని ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. సచివాలయం సిబ్బంది ప్రజలకు సకాలంలో పనిచేయకుండా ప్రజలను ఇబ్బంది కలిగిస్తే ప్రభుత్వ పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సచివాలయం సిబ్బందికి హెచ్చరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం బయోమెట్రిక్ ద్వారా ఉదయం హాజరైన సచివాలయం సిబ్బంది ఫీల్డ్ వర్క్ వెళ్లాలంటే మూమెంట్ రిజిస్టర్లో నమోదు చేసి వెళ్లాలన్నారు. మూమెంట్ రిజిస్టర్ లో ఫీల్డ్ వర్క్ అని నమోదు చేసి సొంత పనులకు వెళ్ళి విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలకు అందాల్సిన పథకాలు అమలులో ఆటంకం కలుగకుండా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం విధులకు నిర్లక్షం వ్యవహరిస్తే వారిపై ప్రభుత్వ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళ్లి ప్రభుత్వ పరమైన ప్రత్యేక కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## విధుల నిర్వహణలో నిర్లక్ష్య వైఖరి వహిస్తే చర్యలు

### వార్డులను తనిఖీ చేసిన అసిస్టెంట్ కమీషనర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)
ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 12వ తేదీన ఉదయం 6 గంటలకు అసిస్టెంట్ కమీషనర్‌తో కలిసి 50 ఎలక్షన్ వార్డులలోని 70 సచివాలయాల పరిధిలోని ప్రజారోగ్య దృష్ట్యా యాదృచ్ఛికంగా తనిఖీ చేశారు. తనిఖీలో శానిటేషన్ అండ్ ఇన్విరాన్మెంట్ సెక్రటరీ యొక్క ఉద్యోగ విధులను సక్రమంగా నిర్వహించుట లేదని, పుర విధులను శుభ్రపరుట సక్రమంగా లేదని, మురికి నీటి కాలువలు పూడిక తీయుట అపరిశుభ్రముగా ఉండి దోమల వృద్ధికి అవకాశం కలిగించునట్లుగా విధులలో నిర్లక్ష్య ధోరణి కనిపించినట్లుగా గుర్తించారు. 70 సచివాలయంలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు తప్పనిసరిగా ఉదయం 5:30 గంటలకు, మధ్యాహ్నం వరకు వారి పరిధిలోని శానిటరీ విభాగపు మస్టర్స్ కార్యాలయమునకు హాజరై సాయంత్రం 5.00 గంటల వరకు వారికి కేటాయించిన పరిధిలో పారిశుధ్యపు కార్మికులచే పనులు చేయించాల్సిందిగా ఆదేశించారు. ఒంగోలు నగరపాలక సంస్థ అన్ని సచివాలయముల పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీ నిర్వహణ, టొకు, చిల్లర, వాణిజ్య వ్యాపార సంస్థలను ప్రతి దినము తనిఖీ చేసి చట్ట ఉల్లంఘన చేసిన వారిపై ప్లాస్టిక్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ రూల్స్ 2016 ను అనుసరించి జరిమానా విధించి సదరు నగదును మున్సిఫల్ ఖజానాకు జమ చేయాలని తెలిపారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్య వైఖరి వహించిన చట్ట పరిధికి లోబడి క్రమశిక్షణ చర్య తీసుకొనడమే గాక, సంబంధిత సెక్రటరీలను వారి విధుల నుంచి తొలగించుట జరుగుతుందని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు వారి డివిజన్‌లో కేటాయించిన పనివారలందరు హాజరు తీసుకుని అనంతరం వారి యొక్క పరిధిలోని పారిశుధ్యపు పని – రోడ్లు శుభ్రము చేయుట, కాలువల నుంచి చెత్త, మురుగుని వెలుపలకు తీయించి శుభ్రపరచి సున్నం బ్లీచింగ్ కలిపి మురికి ప్రాంతంలో చెల్లించవలసినదిగా, పనివారల హాజరును ఉదయం, మధ్యాహ్నం నిఘాతో పరిశీలన చేసి పారిశుధ్యపు పనులను నిర్వహించాలని హెచ్చరించారు. లేనిచో శానిటరీ ఇన్సెస్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలపై పనిలో నిర్లక్ష్య ధోరణి వహించినట్లు భావించి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఒంగోలు మహిళలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)
విజయవాడలోనీ గన్నవరంలో జరిగిన నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి ఒంగోలు నుంచి మహిళలు పాల్గొన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం చాలా సంతోషంగా ఉందని, ఈ ఐదేళ్లలో రాక్షస పాలన జరిగిందని, టిడిపి ప్రభుత్వంలో ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ డ్వాక్రా ఒంగోలు పార్లమెంటు అధ్యక్షురాలు ఉప్పలపాటి నాగేంద్రమ్మ, కత్తి పద్మ ,హజ్మున్నీసా బేగం ,మేరీ రత్నకుమారి ,మోకా పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులు పార్థసారధి, గొట్టిపాటిని కలిసిన బత్తుల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులుగా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్ లను తెలుగుదేశం పార్టీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేష్ యాదవ్ విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకేలు అందజేసి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసినందుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



## కూటమి అగ్రనాయకులకు ధన్యవాదాలు

### 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)
రాష్ట్రంలో ఈరోజు ఏర్పడిన క్యాబినెట్లో అత్యధిక భాగం బీసీలకు అవకాశం కల్పించిన కూటమి అగ్ర నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా 164 అసెంబ్లీ స్థానాలలో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంలో నూటికి 50% గా ఉన్న బీసీల పాత్ర వలనే విజయం సాధించారని తెలిపారు. గత ప్రభుత్వం బీసీల ఓటు బ్యాంకుగా వాడుకున్నారని, 56 కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించుకున్న మోసం చేసిందని తెలిపారు. గతంలో రాష్ట్రంలో ఐదేళ్ల ప్రజాస్వామ్యం లేకుండా పాలన సాగిందని, నేడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా పాలన సాగించాలని కోరారు ప్రత్యేక హోదా సాధించి రాష్ట్రాన్ని రంగాల్లో అభివృద్ధి ఇచ్చిందే విధంగా కొత్త ప్రభుత్వం ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జూన్ 12)
కొండపి ఎమ్మెల్యే, ఆంధ్ర రాష్ట్ర నూతన మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామిని గొల్లపూడి క్యాంపు ఆఫీసులో నూతనంగా మంత్రిగా ప్రమాణస్వీకారం మహోత్సవం అనంతరం ఎంఆర్‌పిఎస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రమోతు శ్రీనివాసులు, మర్రిపూడి మండల మాజీ కోఆప్షన్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గురిజాల నాగయ్య, ప్రకాశం జిల్లా మాదిగ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు గురిజాల నరసింహారావు (బాబురావు), కూకట్ల ఆదినారాయణ, తెలుగుదేశంపార్టీ నాయకులు గంట ఇస్సాకు, తెలుగుదేశం పార్టీ ఎస్సీ విభాగం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలిపిన గిరిజన తండావాసులు





**(షణ్ముఖ వెలుగు, గాండ్లపెంట, జూన్ 12)**

అనంతపురం జిల్లా గాండ్లపెంట మండల పరిధిలోని కల్లుబాయి తండా, గాజులు వారి పల్లి పెద్ద తండాతో పాటు మండల వ్యాప్తంగా వివిధ తండాల్లో బాణసంచా పేల్చి కేకులు కట్ చేసి జై చంద్రబాబు, జై పవన్ కళ్యాణ్, జై కందికుంట అంటూ నినాదాలు చేస్తూ తండాలలో పెద్ద ఎత్తున చిన్న పెద్ద అందరు కలిసి కేకులు తినిపించుకుంటూ కేరింతలు చేసుకుంటూ నినాదాలతో తాండాలలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడుకి, పవన్ కళ్యాణ్‌కి శుభాకాంక్షలు తెలిపారు. గాండ్లపెంట మండల కేంద్రంలోని ఎన్డీఏ కూటమి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, కొణిదెల పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయు సందర్భంగా మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కొండయ్య ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చి కేకులు కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి ప్రజలు భారీ ఎత్తున మద్దతు తెలిపి 164 స్థానాలు ఎన్డీఏ కూటమికి ఇచ్చారని, ఇది ఎన్నడు లేని తీర్పు అని హర్షం వ్యక్తం చేశారు. నవ్యాంధ్రప్రదేశ్‌లకు కొత్త ప్రభుత్వం ఏర్పడి అన్ని మంచే జరుగుతాయంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**రెక్కమాను..** మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీలో నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణసంచా పేల్చి కేకులు కట్ చేసి ప్రజలకు పంచి పెడుతూ జై టిడిపి, జై పవన్ కళ్యాణ్, జై ఎన్డీఏ కూటమి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంలోనే చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేయడం విశేషం. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో ఉన్న వైసిపి పార్టీ చేసినా అరాచకాలపై మండిపడి ప్రజలు ఎన్డీఏ కూటమికి మంచి మెజార్టీ ఇచ్చారని, నవ్యాంధ్రప్రదేశ్ రెండోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడం ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల కన్వీనర్ వెంకట రమణారెడ్డి, జనసేన మండల కన్వీనర్ రవీంద్ర నాయక్, చామలగోంది సర్పంచ్ శివప్ప నాయుడు, బూత్ కన్వీనర్ లోకేష్ గౌడ్డు, వెలగల ప్రసాద్, మైనార్టీ నాయకులు అక్రమ్ సికిందర్, మల్లికార్జున నాయుడు, సురేష్, అంజనప్ప నాయుడు, సీనియర్ టిడిపి నాయకులు బాదుల్లా, గంగిరెడ్డి, రామచంద్రనాయక్, నాగభూషణ , సుధాకర్ నాయక్, కృష్ణ నాయక్, హరినాయక్ టిడిపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఖమ్మంపాడులో టీడీపీ నాయకుల సంబరాలు

**(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జూన్ 12)**







ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా చేజర్ల మండలం తూర్పు ఖమ్మంపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ పార్టీలో చేరిన కొమ్మల పెంచలయ్య ప్రసాద్





**(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జూన్ 12)**

నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడుకి మండల కేంద్రమైన చేజర్ల బస్టాండ్ ఆవరణలో చేజర్ల బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు కంచి బాణా సంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చేజర్ల మండల అధ్యక్షులు గుండాల విజయభాస్కర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కుంకు బాలయ్య నాయుడు, బట్టల కృష్ణయ్య ఆధ్వర్యంలో గొల్లపల్లి గ్రామానికి చెందిన కొమ్మల పెంచలయ్య , కొమ్మల ప్రసాద్, భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ అధ్యక్షుడు గుండాల విజయ భాస్కర్ రెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించి బిజెపి కండువా కప్పి ఆహ్వానించారు. కొమ్మల పెంచలయ్య , కొమ్మల ప్రసాద్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు నచ్చి భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ నాయకత్వం వారి విధి విధానాల నచ్చి పార్టీలో చేరడం జరిగిందని, ప్రజలకు ప్రధానమంత్రిగా వారు చేసిన సేవలు నచ్చి పార్టీలో చేరామని తెలిపారు. మండల బిజెపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పేదలకు అన్నదానం




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 12)**

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని లక్కిసెట్టి పాలెంలో బుధవారం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లీశ్వరి ఆధ్వర్యంలో నగర పంచాయతీ ఎస్సీ సెల్ అధ్యక్షులు జ్యోతి మల్లికార్జున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కుంచాల శేషు, గోపనబోయిన గోపి, సొంగ కొండలరావు, గోపనబోయిన తిరుపతిరావు, నూకతోటి ప్రదీప్, నూకతోటి యేసు, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

## కమ్మపాలెంలో కేక్ కట్ చేసిన మహిళలు









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 12)**

ఒంగోలులోని కమ్మపాలెం 7,8, డివిజన్ చెందిన సెంటర్లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కేకులు కట్ చేసి మహిళలు నారా చంద్రబాబు నాయుడుకి హారతులు పట్టారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో 7 డివిజన్ కార్పొరేటర్, 8వ డివిజన్ కార్పొరేటర్‌లు, రమణయ్య తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎన్టీఆర్ వేషధారణలో ఆటో నడిపే వ్యక్తి వేషం ధరించి అందరినీ ఆకట్టుకున్నాడు.


## పక్షవాతం నిర్ధారించేందుకు అధునాతన యంత్రం

### కేరోటిడ్ డాప్లర్‌తో ముందస్తు వైద్య పరీక్ష

### విలేకరులకు వైద్య పరీక్షలు

### ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ యామిని



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 12)**

ప్రత్యేకమైన అధునాతన కేరోటిడ్ డాప్లర్ వైద్య యంత్రం పరీక్ష ద్వారా పక్షవాతం ముందుగానే నిర్ధారించవచ్చని, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ యామిని అన్నారు. స్థానిక పెద్ద బజారులోని జిల్లా జర్నలిస్ట్ భవన్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి, పలువురు జర్నలిస్టులకు ఉచిత పరీక్షల కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో సుమారు 50 ఏళ్లకు పైబడిన వారికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చేదని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మానసిక ఒత్తిళ్ళ కారణంగా, వయసుతో సంబంధం లేకుండా, పలువురు చిన్న వయసులోనే పక్షవాతానికి గురవుతున్నారని తెలిపారు. బిపి, షుగర్ బారిన పడిన రోగులకు పక్షవాతం బారిన పడే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా జీవన విధానంలో ఆహారపు అలవాట్లను క్రమబద్ధంగా తీసుకుంటూ ఉండాలని, దీని ద్వారా రోగాల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. తెల్లన్నము తక్కువగా తీసుకుంటూ, ఆహారపు నియమాలు పాటించాలన్నారు. నెల్లూరు నగరంలో న్యూరాలజీకు సంబంధించి అధునాత పద్ధతుల్లో తయారు చేసిన కేరోటిడ్ డాప్లర్ యంత్రాన్ని పొగ తోటలోని తమ యామిని న్యూరో కేర్ వైద్యశాలలో అందుబాటులో తీసుకు వచ్చామని తెలిపారు. రోగులకు అందుబాటుల ధరల్లోనే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ముందస్తు చర్యలలో భాగంగా, యంత్రం ద్వారా వైద్య పరీక్షలను చేయించుకుంటే మంచిదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎండి.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా అన్నదానం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 12)**

మార్కాపురం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిచి త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ప్రజలకు పొదిలి ప్రకాష్ నగర్‌లో తెలుగుదేశం నాయకులు మౌలాలి బుధవారం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో ప్రకాష్ నగర్ ప్రజలు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, షాహిద్, ముల్లా రబ్బాని, యువ నాయకులు గిద్దలూరు శ్రీకాంత్, పట్టణ, మండల తెలుగుదేశం నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
7 | 13.06.24
గురువారం

# గ్రీన్ టీతో ఇలా ఫేస్‌ప్యాక్ వేస్తే స్కిన్ మెరుస్తుంది..



చర్మాన్ని మెరిపించడంలో గ్రీన్ టీ ముందుంటుంది. బరువు తగ్గించే ఈ గ్రీన్ టీ.. స్కిన్‌కి కూడా చాలా బాగా పనిచేస్తుంది. చర్మ సమస్యలు, రంగు మారడం, పిగ్మంటేషన్, నల్ల మచ్చలు, మొటిమల వంటి సమస్యల్ని దూరం చేయడంలో ముందుంటుంది. ఇందుకోసం మనం ఇంట్లోనే ఎలా ఫేస్ ప్యాక్ వేయాలో తెలుసుకోండి.

**గ్రీన్ టీ బెనిఫిట్స్..**చర్మం వృద్ధాప్య సంకేతాలను దూరం చేయడంలో గ్రీన్ టీ చాలా మంచిది. గ్రీన్ టీ రంధ్రాలను అన్‌లాక్ చేయడంలో హెల్ప్ చేస్తుంది. చర్మాన్ని సున్నితంగా ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ మొటిమలు, మచ్చల్ని దూరం చేయడంలో హెల్ప్ చేస్తాయి. గ్రీన్ టీలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్ గుణాలు కూడా పుష్కలంగా ఉన్నాయి.

**చందనం, ఓట్స్ ఫేస్‌ప్యాక్..**

**తేనె..**తేనెలో కూడా ఎన్నో ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. తేనె ఆరోగ్యంతో పాటు చర్మానికి చాలా మంచిది. తేనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు కూడా ఉన్నాయి. ఇది చర్మాన్ని కాంతివంతం చేయడమే కాకుండా రిఫ్రెష్‌గా అనిపిస్తుంది. వృద్ధాప్య సంకేతాలను నివారించడంలో తేనె గ్రేట్‌గా సాయపడుతుంది. చర్మాన్ని యవ్వనంగా ఉంచడానికి తేనె మేలు చేస్తుంది.



**ఎసెన్షియల్ ఆయిల్స్..**చర్మానికి ఎసెన్షియల్ ఆయిల్స్ చాలా ముఖ్యమైనవి. ఎసెన్షియల్ ఆయిల్స్ చర్మానికి పోషణ అందిస్తాయి. మొటిమలని తగ్గిస్తాయి. అంతేకాకుండా చర్మ రంధ్రాలను అన్‌లాగ్ చేయడానికి, బ్యాక్టీరియాని దూరం చేస్తాయి. ఇది మంచి మాయిశ్చరైజర్‌గా కూడా పనిచేస్తుంది.

**ప్యాక్ ఎలా రెడీ చేయాలంటే..**దీనికోసం.. ఓ టేబుల్ స్పూన్ గ్రీన్ టీ, ఓ టేబుల్ స్పూన్ తేనె, రెండు, మూడు చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ కలపాలి. పేస్టులా మారేందుకు కొద్దిగా నీరు కలపాలి. ఇప్పుడు దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల తర్వాత క్లీన్ చేయండి. మీ ముఖంపై ఏదైనా వాడే ముందు ప్యాచ్ టెస్ట్ చేయడం మంచిది. దీనిని రెగ్యులర్‌గా ఫేస్‌కి అప్లై చేస్తే మొటిమలు, మచ్చలు దూరమై ముఖం వెలిగిపోతుంది.

# ఈ టిప్స్ ఫాలో అయితే చర్మ ముడతలు తగ్గి యంగ్‌గా కనిపిస్తారు..







స్కిన్ కేర్ అనేది ప్రతి ఒక్కరికి వేర్వేరుగా ఉంటుంది. మీరు ఏ వయసు వారైన స్కిన్ కేర్ అనేది ఫాలో అవ్వాలి. వృద్ధాప్యం అనేది సహజ ప్రక్రియ. దీనిని మనం ఆపలేం. కానీ, సరైన స్కిన్ కేర్‌తో వృద్ధాప్య లక్షణాలను దూరం చేసుకోవచ్చు. మరి ఆ టిప్స్ ఏంటో తెలుసుకోండి.

**క్లీనింగ్..**ముప్పై, నలభైలలో చర్మాన్ని క్లీన్ చేసుకోవడం చాలా ముఖ్యం. ముప్పైలో రోజుకి రెండు సార్లు చేసుకోండి. మేకప్, సన్‌స్క్రీన్, ఇతర మలినాలను క్లీన్ చేసేందుకు రెండు సార్లు క్లీన్ చేసుకోండి.

నలభైలో ఉన్నవారు మైల్డ్ క్లెన్సర్ ఎంచుకోండి. స్క్రబ్ కూడా వాడొచ్చు. దీనికోసం మరిగించిన పాలతో క్లీన్ చేసుకోవడం మంచిది.

చర్మాన్ని మెరిపించే సీరమ్..

**ఎక్స్‌ఫోలియేషన్..**ముప్పైలలో స్కిన్‌ని ఎక్స్‌ఫోలియేట్ చేయడం ముఖ్యం. ఇది చర్మంలోని మృతకణాలను తొలగించి చర్మాన్ని పునరుద్ధరించడంలో సాయపడుతుంది. ఇది చర్మాన్ని మృదువుగా, కాంతివంతంగా మార్చడంలో సాయపడుతుంది. వారానికి ఓసారి ఇలా చేయడం మంచిది. దీనికోసం ఓట్స్, బియ్యంపిండి, శనగపిండితో ఎక్స్‌ఫోలియేట్ చేయొచ్చు. నలభైలలో వారానికి ఒకటి, రెండు సార్లు చేయొచ్చు. అయితే అతిగా చేయొద్దు.

**మాయిశ్చరైజర్..**మాయిశ్చరైజర్ చర్మానికి చాలా ముఖ్యం.. దీనిని ఎప్పుడూ స్కిప్ చేయొద్దు. వయసు పెరిగే కొద్దీ స్కిన్ డ్రై అవుతుంది. కాబట్టి, దీనిని తగ్గించేందుకు మాయిశ్చరైజర్ రాయాలి. ఉదయం, సాయంత్రంరాయాలి. గ్లిజరిన్ ఉన్న మాయిశ్చరైజర్ మంచిది. కలబంద, కొబ్బరి నూనె కూడా మంచిది.

**సన్‌స్క్రీన్..**ఏ వయసు వారైనా సన్‌స్క్రీన్ చాలా ముఖ్యమైంది. దానిని అస్సలు మర్చిపోవద్దు. ఇది సూర్య కిరణాల నుండి స్కిన్‌ని కాపాడుతుంది. మీ ముప్పైలలో 30 లేదా అంతకంటే ఎక్కువగా ఉన్న సన్‌స్క్రీన్ వాడాలి. ఇది వడదెబ్బని, వృద్ధాప్యాన్ని దూరం చేస్తుంది.

**నీరు తాగడం..**అన్ని వయసుల వారికి నీరు తాగడం మంచిది. జుట్టు, చర్మానికి చాలా అవసరం. బ్యాలెన్స్‌డ్ డైట్‌తో పాటు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. హైడ్రేటెడ్ స్కిన్ కోసం రోజుకి 7 నుంచి 8 గ్లాసు నీరు తాగాలి. షుగర్ డ్రింక్స్ తగ్గించాలి.

# ఈ జ్యూస్‌లు తాగితే హిమోగ్లోబిన్ లెవల్స్ పెరుగుతాయి..



ఎర్ర రక్త కణాల్లో కనిపించే హిమోగ్లోబిన్, ఊపిరితిత్తుల నుండి ఆక్సీజన్‌ని ఆక్సిహిమోగ్లోబిన్‌గా కణజాలాలకు తీసుకెళ్తుంది. కార్బన్ డయాక్సైడ్‌ని దూరం చేస్తుంది. ఎముక మజ్జ, మజ్జ కణాల్లో ఉత్పత్తి చేసిన హిమోగ్లోబిన్ ఎర్ర రక్త కణాలుగా మారుతుంది. ఎర్ర రక్తంలో కనిపించే ఏకైక ప్రోటీన్ హిమోగ్లోబిన్. ఎర్ర రక్తకణాలను పెంచే ఐరన్ ఎక్కువగా ఉండే ఫుడ్స్, డ్రింక్స్ తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ ఉత్పత్తికి హెల్ప్ చేస్తుంది. అలాంటి డ్రింక్స్ గురించి తెలుసుకోండి.

**పీ ప్రోటీన్ షేక్..**పీ ప్రోటీన్ పౌడర్‌లో సాధారణంగా వెయ్ ప్రోటీన్ ఎక్కువ ప్రోటీన్ ఉంటుంది. మీరు 20 గ్రాముల బఠానీ తింటే.. మీకు రోజువారీ అవసరమయ్యే 30 శాతాన్ని పొందొచ్చు. ఇతర షేక్స్, స్మూతీస్‌ని తయారుచేయండి. మీరు ఈ బఠానీ ప్రోటీన్ షేక్‌ని ఆస్వాదించొచ్చు. షేక్స్, స్మూతీస్‌లా చేసి తాగొచ్చు.

**నువ్వులు, ఖర్జూరం స్మూతీ..**నువ్వులు, ఖర్జూరంతో చేసిన సింపుల్ అండ్ టేస్టీ స్మూతీలో కూడా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. నువ్వుల్లో పాస్ఫరస్, విటమిన్ ఈ, జింక్‌లు పుష్కలంగా ఉంటాయి. ఈ స్మూతీని నానెబెట్టిన ఖర్జూరాలు, నువ్వులు, నెయ్యి, పాలతో కలిపి మెత్తగా మిక్సీ పట్టి చేస్తారు.

**రక్తాన్ని పెంచే డ్రింక్..**

**పుదీనా జ్యూస్..**పుదీనా ఆకుల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల పుదీనా ఆకుల్లో 16 మిల్లీ గ్రాముల ఐరన్ కంటెంట్ పెంచడానికి హెల్దీ వే.

**ప్రూనే జ్యూస్..**ప్రూనే జ్యూస్ కూడా ఐరన్‌కి మంచి సోర్స్. ఇది రోజువారీ అవసరాలలో ఐదో వంతుని అందిస్తుంది. ఇది ఐరన్ స్థాయిలను పెంచడమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను పెంచదు. కాబట్టి, షుగర్ ఉన్నవారికి కూడా మంచిది.



**బీట్‌రూట్ జ్యూస్..**బీట్‌రూట్‌లో వాంగనీస్, పొటాషియం, ఐరన్, విటమిన్ సి, బీటైన్ వంటి పోషకాలున్నాయి. ఇవి ఎర్ర రక్తకణాలు ఆక్సీజన్‌ని బాగా ఉపయోగించుకోవడానికి సాయపడతాయి. అలాగే, ప్రతి 100 గ్రాముల బీట్‌రూట్‌లో దాదాపు 0.8 మిల్లీగ్రాముల ఐరన్ ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

**వీటితో పాటు..**బీట్‌రూట్, గుమ్మడికాయ, పాలకూర, పుదీనా రసాలను తాగడం వల్ల మీకు ప్లాంట్ బేస్డ్ ఐరన్ లభిస్తుంది. అలాగే, ఈ డ్రింక్స్ విటమిన్స్, ఖనిజాలతో నిండి ఉంటాయి. దీంతో ఐరన్ లెవల్స్ పెరుగుతాయి. మీ భోజనంలో జంతు మూలాల నుండి ఐరన్ పోషకాలతో పాటు ఈ రసాలను తీసుకోవడం వల్ల మరింత ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది.

# వాల్‌నట్స్ రోజూ నానబెట్టి తింటే ఈ లాభాలు అందుతాయి..

మన ఆరోగ్యం కోసం ఎన్నో వర్కౌట్స్ చేస్తాం. ఎన్నో ఫుడ్స్ తీసుకుంటాం. అందులో భాగంగా ఆరోగ్య నిపుణుల ప్రకారం.. వాల్‌నట్స్‌ని రాత్రంతా నీటిలో నానబెట్టి తింటే ఉదయాన్నే ఖాళీ కడుపుతో తింటే చాలా లాభాలున్నాయి. కాబట్టి, వాల్‌నట్స్‌లో ఎన్నో పోషకాలున్నాయి. దీని వల్ల ఏమేం లాభాలున్నాయో తెలుసుకోండి.


**బ్రెయిన్ హెల్త్..**వాల్‌నట్స్ తింటే బ్రెయిన్‌పై పాజిటీవ్ ఎఫెక్ట్ ఉంటుంది. వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. దీంతో బ్రెయిన్ హెల్త్ బాగుంటుంది. మానసిక సమస్యలు దూరమవుతాయి. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



**జీర్ణ వ్యవస్థకి..**నానబెట్టిన వాల్‌నట్స్‌లో ఫైటిక్ యాసిడ్‌ని తగ్గించే గుణాలు ఉన్నాయి. వీటిని తింటే జీర్ణ వ్యవస్థ మెరుగై మలబద్ధకం, అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు దూరమవుతాయి. పేగు ఆరోగ్యాన్ని కూడా మెరుగ్గా చేస్తుంది.

**డ్రై ఫ్రూట్స్, డ్రైడ్ ఫ్రూట్స్.. రెండింటి మధ్య తేడా..**





**బరువు కంట్రోల్..**వాల్‌నట్స్ తింటే బరువుని మెంటెయిన్ చేయడానికి సాయపడతాయి. ఎక్కువ మొత్తంలో ఫైబర్, ప్రోటీన్ కంటెంట్‌ని కలిగి ఉంటుంది. అవి మనకు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. కేలరీలను తగ్గిస్తాయి. దీంతో శరీర బరువు పెరగదు.

**ఎముకల ఆరోగ్యం, ఇమ్యూనిటీ..**వాల్‌నట్స్‌లో మెగ్నీషియం, కాల్షియం, ఫాస్ఫరస్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఎముకల సమస్యలు దూరమవుతాయి. దీంతో పాటు..ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్న వీటిని తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. వాల్‌నట్స్‌లో అధిక మొత్తంలో జింక్, విటమిన్ ఇ ఉంటుంది. కాబట్టి, మన ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఇన్ఫెక్షన్స్, అనారోగ్యాలను సమర్థవంతంగా దూరం చేస్తాయి.

**నిద్ర సమస్యలు దూరం..**నానబెట్టిన వాల్‌నట్స్ తింటే నిద్ర నాణ్యత మెరుగవుతుంది. నిద్రలేమి సమస్య దూరమవుతుంది. వాల్‌నట్స్‌లో మెలటోనిన్ అనే హార్మోన్ ఉంటుంది. ఇది రాత్రిపూట ప్రశాంతంగా నిద్రపోవడానికి సాయపడుతుంది. వాల్‌నట్స్ నానబెట్టి తీసుకుంటే మంచిది. అంతేకాకుండా వీటిని తీసుకుంటే ఆందోళన, ఒత్తిడిని తగ్గిస్తుంది. మన శరీరంలో హ్యాపీ హార్మోన్‌ని విడుదల చేస్తుంది. ఎందుకంటే, వాల్నట్స్‌లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

**గుండె ఆరోగ్యం..**వాల్‌నట్స్‌లో హెల్దీ ఫ్యాట్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి మన బాడీలోని చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి. దీంతో బీపి కంట్రోల్‌లో ఉండి గుండె సమస్యలు కూడా దూరమవుతాయి.

**అందానికి..**వాలనట్స్ మన అందాన్ని కూడా పెంచుతాయి. ఎందుకంటే, వీటిలో విటమిన్ బి5, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా చేస్తాయి. ఈ పోషకాలు మన శరీరంలో మంటని తగ్గించి పొడి చర్మ సమస్యని దూరం చేస్తాయి. వృద్ధాప్య ప్రక్రియ నుండి మనల్ని రక్షిస్తుంది. మనకి కాంతివంతమైన చర్మాన్ని అందిస్తుంది. దీంతో పాటు.. బి7 వాల్‌నట్స్‌లో బయోటిన్ రూపంలో లభిస్తుంది. ఇది మన జుట్టు కుదుళ్ళని బలంగా చేసి రాలడాన్ని తగ్గిస్తుంది. జుట్టు పెరుగుదలకి హెల్ప్ చేస్తుంది.

**వాల్‌నట్స్‌ని ఎలా నానబెట్టాలి?**వాల్‌నట్స్‌లోని పోషకాలు నానబెట్టి తింటే శరీరం ఈజీగా అబ్జార్బ్ చేసుకుంటుంది. అందుకోసం గ్లాసు నీటిలో వాల్‌నట్స్‌ని నానబెట్టి ఉదయాన్నే కడిగి తీసుకోవాలి.

# 33,000 అడుగుల ఎత్తులో సికందర్ యాక్షన్

మనల్ని మనం నిరూపించుకునే అవకాశం కొద్దిమందికే వస్తుందంటూ చెప్పే అందాల తార రష్మిక.. వరుస విజయాలతో దూసుకుపోతుంది. ప్రస్తుతం 'పుష్ప 2'తో బిజీగా గడుపుతున్న ఈ భామ.. బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో కలిసి 'సికందర్'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఏఆర్ మురుగదాస్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ త్వరలో మొదలుకానుందని తెలుపుతూ..ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు నిర్మాత సాజిద్ నడియాడ్ వాలా. "ఈ నెల 18న 'సికందర్' యాక్షన్ ప్రారంభం కానుంది. మొదటి రోజున అతిపెద్ద ఎయిర్ యాక్షన్ సీక్వెన్స్‌తో ఈ షూటింగ్‌ను ఆరంభించనున్నామని తెలుపడానికి చాలా ఉత్సాహంగా ఉంద"ని వ్యాఖ్యాల్ని జోడించారు. తొలి షెడ్యూల్‌లో భాగంగా సల్మాన్‌తో సముద్రమట్టానికి దాదాపు 33,000 అడుగుల ఎత్తులో అద్భుతమైన వైమానిక యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నట్లు, ఇది ఈ ప్రాజెక్టుకే కీలకమైన సన్నివేశమని తెలుస్తోంది. వచ్చే ఏడాది ఈద్‌కి విడుదల కానుందీ చిత్రం.



# భయపడకు... మరో ప్రపంచం వస్తోంది

'హుభాషా చిత్రాన్ని నాగ్ అశ్విన్ తెరకెక్కించారు. వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మించింది. దీపికా పదుకొణె కథానాయిక. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్ర ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. "ఈ వరల్డ్‌లో చివరి నగరం కాశీ" అంటూ రాజేంద్రప్రసాద్‌తో పాటు ఓ పిల్లాడు చెప్పే డైలాగ్‌తో కల్కి ప్రపంచాన్ని ఆసక్తికరంగా పరిచయం చేసింది చిత్ర బృందం. "ఈ లోకంలో ఉన్నది కాంప్లెక్స్ ఒక్కటే. దేవుడు ఒక్కడే.." అంటూ ఈ కథలోని మరో కొత్త లోకాన్ని చూపించారు. 6వేల ఏళ్ల క్రితం కనిపించకుండా పోయిన ఓ శక్తి కోసం ఈ రెండు లోకాల మధ్య జరిగే పోరు ఈ చిత్ర ప్రధాన ఇతివృతంగా ఉండనున్నట్లు ప్రచార చిత్రాన్ని బట్టి అర్థమవుతోంది. ట్రైలర్‌లో భవిష్యత్తు కాశీ నగరాన్ని చూపించిన తీరు.. కాంప్లెక్స్ ప్రపంచం ఆసక్తిని రేకెత్తిస్తోంది. భైరవగా ప్రభాస్ చేసిన యాక్షన్ హంగామా.. "రికార్డ్స్ చూసుకో ఇంత వరకు ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు" అంటూ ట్రైలర్‌లో ఆయన చెప్పిన డైలాగ్ అలరించింది. ఆఖర్లో "ఇంకా తొలి ఊపిరి కూడా తీసుకోని ఈ బిడ్డ కోసం ఇంకా ఎంత మంది చనిపోవాలి" అంటూ దీపిక అడగ్గా.. "భయపడకు.. మరో ప్రపంచం వస్తోంది" అంటూ చిత్రమైన ఆహార్యంతో కమల్ చెప్పిన డైలాగ్ అంచనాలు పెంచేలా ఉన్నాయి. ప్రస్తుతం నిర్మాణాంతర పనుల్లో ఉన్న ఈ సైన్స్ ఫిక్షన్ సినిమా ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకి సంతోష్ నారాయణన్ సంగీతమందించారు.


ప్రభాస్

# మాస్ డైరెక్టర్‌తో బాలకృష్ణ.. నాలుగోసారి రిపీట్ కానున్న కాంబో




ఇండస్ట్రీలో కొన్ని కాంబినేషన్స్‌కు ప్రత్యేక అభిమానులుంటారు. అలాంటి వాటిలో ఒకటి బాలకృష్ణ-బోయపాటిల కాంబో. వీళ్లిద్దరి సినిమా వస్తుందంటే మాస్ ప్రేక్షకులకు పండగే. గతంలో వీళ్లిద్దరు కలిసి చేసిన 'సింహ', 'లెజెండ్', 'అఖండ'.. మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు నాలుగోసారి ఈ మాస్ కాంబో రిపీట్ కానుంది. నేడు బాలకృష్ణపుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో ఆయనకు విషెస్ వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బోయపాటితో సినిమాను అధికారికంగా ప్రకటించారు. న%ఔఔ%4 అనే వర్కింగ్ టైటిల్‌తో ఇది తెరకెక్కనుంది. 14రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట దీని నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి బాలయ్య కూతురు తేజస్విని కూడా నిర్మాతగా వ్యవహరించడం గమనార్హం. 2021లో ప్రేక్షకుల ముందుకొచ్చిన 'అఖండ'బాలయ్య కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌ల జాబితాలో చేరింది. దీనికి సీక్వెల్ ఉంటుందని బోయపాటి గతంలో చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడీ న%ఔఔ%4.. 'అఖండ'నా లేదంటే కొత్త సినిమానా అనేది క్లారిటీ రావాల్సి ఉంది. ఇటీవల ఈ సీక్వెల్ గురించి బోయపాటి మాట్లాడుతూ..“ ఎన్నికల హడావిడి పూర్తయ్యాక 'అఖండ2' పై అధికారిక ప్రకటన ఉంటుంది. 'అఖండ'లో పసిబిడ్డ.. ప్రకృతి.. పరమాత్మ.. కాన్సెప్ట్‌లనే చూపించాం. దీని సీక్వెల్‌లోనూ సమాజానికి కావాల్సిన ఓ మంచి విషయం ఉంటుంది. దైవత్వం మనందరిలో ఒక భాగం. దాన్ని తెరపై చూపిస్తే ప్రేక్షకులు ఆదరిస్తారు' అని తెలిపారు. ఇప్పుడు ఎన్నికల హడావిడంతా అయిపోయింది కాబట్టి దీని గురించే ప్రకటన చేశారా అని సినీ ప్రియులు భావిస్తున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ బాబీ దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ చేస్తోన్న సంగతి తెలిసిందే. నేడు ఆయన బర్త్‌డే సందర్భంగా గ్లింప్స్‌ను విడుదల చేసి విషెస్ చెప్పింది. అందులో బాలయ్య మాస్ లుక్‌లో ఉన్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు.

# రివ్యూ: మిరల్..

చిత్రం: మిరల్ తారాగణం: భరత్, వాణీ భోజన్, కేఎస్ రవికుమార్, మీరా కృష్ణన్, రాజ్ కుమార్, మాస్టర్ అంకిత్ తదితరులు సంగీతం: ఎస్.ఎన్. ప్రసాద్ ఛాయాగ్రహణం: సురేశ్ బాలా కూర్పు: ఆర్. కళైవాణన్ నిర్మాణ సంస్థ: యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ రచన, దర్శకత్వం: ఎం. శక్తివేల్ స్ట్రీమింగ్ వేదిక: ఆహా.

'ప్రేమిస్తే' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన కోలీవుడ్ నటుడు భరత్ ). ఆయన నటించిన హారర్ థ్రిల్లర్ ఫిల్మ్ 'మిరల్' వాణీ భోజన్ మరో కీలక పాత్రధారి. దర్శకుడు ఎం.శక్తివేల్ తెరకెక్కించిన ఈ మూవీ తెలుగులో కొన్ని రోజుల క్రితం బాక్సాఫీసు ముందుకొచ్చింది. ఇప్పుడు ప్రముఖ తెలుగు ఓటీటీ 'ఆహా' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో ఉన్న కంటెంట్ ఏంటి? ఎలా ఉందంటే?


**కథేంటంటే?:** సివిల్ ఇంజినీర్ హరి (భరత్).. రమ (వాణీ భోజన్)ను ప్రేమించి, పెళ్లి చేసుకుంటాడు. ఈ దంపతుల ముద్దుల తనయుడి పేరు సాయి (మాస్టర్ అంకిత్). ఈ చిన్న కుటుంబంలో ఏదో అలజడి. మాస్క్ ధరించి తన భర్తను ఎవరో హత్య చేసినట్టు రమకు ఒక రాత్రి పీడకల వస్తుంది. జరగరానిదేదో జరగనుందంటూ ఎప్పుడూ ఆందోళన చెందుతుంటుంది. రమ పరిస్థితి గురించి హరి తన అత్తగారికి (మీరా కృష్ణన్) వివరిస్తాడు. గ్రామ దేవతకు పూజ చేస్తే తప్ప ప్రశాంతత ఉండదని ఆమె చెప్పడంతో.. భార్య, కుమారుడితో కలిసి హరి.. అత్తగారింటికెళ్తాడు. పూజ పూర్తయిన రోజు రాత్రే అర్జంట్ పని ఉందంటూ హరి కుటుంబం అక్కడినుంచి తిరిగి పయనమవుతుంది. మార్గమధ్యలో కారు టైరు పంక్చర్ అవుతుంది. అర్ధరాత్రి ఆ దారిలో ప్రయాణిస్తే ప్రాణాలు పోతాయనేది సమీప గ్రామస్థుల మూఢనమ్మకం. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి ఈ సమాచారాన్ని చేరవేస్తూ జాగ్రత్తగా ఉండమని హరి ఫ్యామిలీకి చెబుతాడు. అదే సమయంలో.. రమకు కొన్నిరోజుల క్రితం వచ్చిన కల కళ్లెదుట ప్రత్యక్షమవుతుంది. మరి, రమ ఊహించినట్టు హరి చనిపోయాడా? అతడి చావు కోరుకుందెవరు? ఆ రోడ్డులో నిజంగానే దెయ్యాలున్నాయా? రమ తండ్రి రవికుమార్ (కేఎస్ రవికుమార్), హరి స్నేహితుడు ఆనంద్ (రాజ్ కుమార్) పాత్రలేంటి? తదితర ప్రశ్నలన్నింటికీ సమాధానం సినిమా చూసి తెలుసుకోవాల్సిందే .

**ఎలా ఉందంటే?:** ఓ రొటీన్ రివెంజ్ స్టోరీకి హారర్ ఎలిమెంట్స్ జోడించి ఈ సినిమాని తెరకెక్కించారు దర్శకుడు శక్తివేల్. ఆయన ఆలోచన బాగుందిగానీ దాన్ని తెరపై అర్థవంతంగా చూపలేకపోయారు. అసలు పాయింట్ చెప్పేందుకు చాలా సమయం తీసుకున్నారు. షార్ట్‌ఫిల్మ్ స్టోరీని అనవసర సీన్స్‌తో సినిమాగా రూపొందించారనే ఫీలింగ్ ప్రేక్షకుడికి తప్పక కలుగుతుంది. హరి కుటుంబ నేపథ్యం, రాజ్ కుమార్‌తో స్నేహం, రమ పుట్టిల్లు, ఆ పల్లెటూరి వాతావరణం, అక్కడకు హరి, రాజ్‌కుమార్ ఫ్యామిలీల రాక.. ఫస్టాఫ్ మొత్తం ఈ అంశాలతోనే నిండిపోయింది. రమ పుట్టింట్లోనే భూతం ఉందా? అని సందేహపడేలా కొన్ని సీన్స్ క్రియేట్ చేశారు. కథలోకి వెళ్లేకొద్దీ రమ బ్యాక్‌స్టోరీ ఏమైనా చెబుతారేమో అని ఆశపడిన ప్రేక్షకుడికి నిరాశే ఎదురవుతుంది. ఫ్యామిలీతో కలిసి హరి అర్ధరాత్రి ఇంటికి బయలుదేరడం నుంచి సినిమాలో వేగం పెరుగుతుంది. హరి-రమల ప్రేమ వివాహాన్ని స్వాగతించని రవికుమారే వారికి అపాయం తలపెట్టాడా? అన్న ప్రశ్నను లేవనెత్తుతూ ఇంటర్వెల్ బ్యాంగ్ సెకండాఫ్‌పై ఆసక్తి రేకెత్తిస్తుంది .

అడవిని తలపించే దారిలో అర్ధరాత్రి అపాయంలో చిక్కుకున్న తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు హీరో చేసే ప్రయత్నమే ద్వితీయార్ధంలో సింహభాగంగా ఉంటుంది. ఓ వైపు భయం, మరోవైపు ఫ్యామిలీని రక్షించుకోవాలనే తాపత్రయం.. ఇలా విభిన్న కోణాలను స్పృశిస్తూ భరత్ ఆకట్టుకున్నారు. విజువల్స్, సౌండ్ ఎఫెక్ట్స్ మంచి థ్రిల్ పంచుతాయి. ఆ రోడ్డు ఎందుకంత ప్రమాదకరం? అన్నది మాటలకే పరిమితం చేశారు తప్ప దాన్నీ పెద్దగా ఎలివేట్ చేయలేదు. ప్రీ క్లైమాక్స్‌ని ఊహించలేని మలుపులతో రూపొందించడం మంచి అనుభూతి పంచే అంశమేగానీ.. అక్కడే అసలు సంగతి తెలియడంతో ప్రేక్షకుడికి అసంతృప్తి కలుగుతుంది. డబ్బింగ్ కూడా ఈ చిత్రానికి ఓ సమస్యే. కొన్ని ఎపిసోడ్స్‌లో ఎవరు?ఎందుకు? కథ వివరిస్తున్నారో అర్థంకాని పరిస్థితి.

**ఎవరెలా చేశారంటే?:** హరి పాత్రలో భరత్ సెటిల్డ్‌గా నటించి, మెప్పించారు. కుటుంబాన్ని రక్షించుకునేందుకు ఆయన చేసిన సాహసం ఆకట్టుకుంది. 'మీకు మాత్రమే చెప్తా'తో తెలుగు ఆడియన్స్‌ను పలకరించిన వాణీ భోజన్.. ఇందులో ఎక్కువగా భయపడుతూనే కనిపిస్తారు. హీరోయిన్ తండ్రిగా ప్రముఖ దర్శకుడు కేఎస్ రవికుమార్, తల్లిగా మీరా కీష్ణన్, హీరో మిత్రుడిగా రాజ్ కుమార్ పాత్రల పరిధి మేరకు నటించారు. తన అల్లరితో మాస్టర్ అంకిత్ అలరిస్తాడు. సాంకేతిక బృందం విషయానికొస్తే.. సినిమాటోగ్రఫీ, నేపథ్య సంగీతం పలు సన్నివేశాలకు బలాన్ని చేకూర్చాయి. ఎడిటింగ్ లోపం కనిపించింది. రచయిత, దర్శకుడు శక్తివేల్ అటు దైవాన్ని, ఇటు భూతాన్ని తెరపైకి తీసుకొచ్చి.. రొటీన్ కథను కొన్ని ట్విస్ట్‌లతో నింపారు.

**ఫ్యామిలీతో కలిసి చూడొచ్చా?:** ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు. హారర్ ఎలిమెంట్స్ ఉన్నాయి కాబట్టి చిన్న పిల్లలను దూరంగా ఉంచడం బెటర్. అసభ్యకర సన్నివేశాలు, సంభాషణలు లేవు. ట్విస్ట్‌ల కోసం ఈ మూవీని ఈ వీకెండ్ ప్రయత్నించొచ్చు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com